




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 69 | ది.11-5-2025 | విజయవాడ | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## హైదరాబాద్‌లో ఘనంగా మిస్ వరల్డ్ పోటీలు



**హైదరాబాద్,మే 10 (వార్తాప్రభ) :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాల నిర్వహణతో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ లో గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఈ పోటీలు ఆరంభమయ్యాయి. అందె శ్రీ రచించిన జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో 72వ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమమయ్యాయి. మిస్ వరల్డ్ పోటీలకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# నేషన్ ఫస్ట్ అందరి నినాదం కావాలి

- దేశంకోసం అంతా ఏకతాటిపైకి రావడం గొప్ప విశేషం
- ప్రపంచాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్య ఉగ్రవాదం
- ఉగ్రవాదంపై పోరులో త్రివిధ దళాలకు మద్దతుగా ఉందాం
- భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ శుభపరిణామం
- దేశ సమగ్రతకు ప్రధాని, కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెలుగుజాతి అండగా ఉంటుంది
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్‌ఫెయిత్ కార్యక్రమానికి హాజరైన సీఎం






**అమరావతి,మే 10 (వార్తాప్రభ) :** మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా నేషన్ ఫస్ట్ నినాదంతో దేశాన్ని కాపాడుకోవాల్సి ఉందని, ఏ సమస్య వచ్చినా భారతదేశంలో ఉండే ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఉండాల్సిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ శాంతిని ఉగ్రవాదం పట్టి పీడిస్తోందని, తీవ్రవాదం, ఉగ్రవాదం దేశంలో అనిశ్చిత పరిస్థితులకు, ఆర్థిక ఇబ్బందులకు కారణం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో రాజ్ భవన్‌లో శనివారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ ఫెయిత్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు.

**పహల్గాంలో మారణకాండ సృష్టించారు..** పహల్గాంలో ఉగ్రవాదులు మారణకాండ సృష్టించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదు... దేశ శాంతి సుస్థిరతను దెబ్బతీసే అంశం. మనందరం కులమతాలకు అతీతంగా ముక్తకంఠంతో ఉగ్రదాడిని ఖండించాం. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల బాధను ఎవరూ తీర్చలేరు. ఉగ్రవాదుల కాల్పుల్లో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు పర్యాటకులు చనిపోయారు. మన దేశం ఉగ్రవాదంపై పోరాడుతోంది. పహల్గాం కాల్పుల తర్వాత సరిహద్దుల్లో ఐదారు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సమయంలో మన త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడాయి. ఈ పోరాటంలో కొందరు సైనికులు, పౌరులు ప్రాణాలు కోల్పోయారు. యుద్ధంలో మన రాష్ట్రానికి చెందిన వీర సైనికుడు మురళీ నాయక్ ప్రాణాలు వదిలారు. 25 ఏళ్ల వయసులో దేశ రక్షణ కోసం ప్రాణాలు వదిలారు. తన దేహంపై జాతీయ జెండా కప్పుకుని చనిపోతానని చెప్పి వీరోచితంగా పాకిస్తాన్‌తో పోరాడి మురళీనాయక్ చనిపోయారు.

**ప్రజల్ని బాధపెట్టే ఉగ్రవాదాన్ని ఉపేక్షించం..** ఇతర దేశాలను దెబ్బతీసే ఆలోచన భారతదేశం చేయదు. మనదేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే ఎవరైనా మనమీదకు వస్తే గట్టిగా సమాధానమిస్తాం. ప్రజల్ని బాధపెట్టే తీవ్రవాదం, ఉగ్రవాదాన్ని ఎప్పటికీ ఉపేక్షించం. దేశంలోని ప్రతి కులం, ప్రాంతం, మతం దేశంకోసం పని చేస్తామని చెప్పాయి. ప్రజాస్వామ్యంలో విభేధాలు ఉండొచ్చు, అభిప్రాయలు, సిద్ధాంతాలను ఏకీభవించకపోవచ్చు. కానీ రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం ఎప్పుడూ వెనకడుగు వేసిన సందర్భాలు లేవు. మత విద్వేషాలు లేని రాష్ట్రం ఏపీ. అందుకే ఇక్కడ అన్ని మతాల ప్రతినిధులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. దేశ రక్షణలో ప్రాణాలు పోగొట్టుకున్న సైనికుల త్యాగాన్ని మనం గుర్తు చేసుకుని సంఘీభావంగా ఉండాలి. భారతదేశం చేసే పోరాటానికి సంఘీభావాన్ని తెలియజేయాలి. సరిహద్దు రాష్ట్రాల్లోని ప్రజలు ఐదారు రోజుల బాంబుల మోతతో ఇబ్బందులు పడ్డారు. చదువుకునే విద్యార్థులు స్వరాష్ట్రాలకు తిరిగొచ్చారు.

**కాల్పుల విరమణ శుభపరిణామం..** శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు భారత్-పాక్ దేశాల ఆర్మీ చీఫ్‌లు మాట్లాడుకుని కాల్పుల విరమణ చేయాలని నిర్ణయించారు. ఈ పిలుపు కూడా ముందు పాకిస్తాన్ నుంచి రావడంతోనే భారత్ అంగీకరించింది. మన దేశానికి యుద్ధం చేయాలనే ఆలోచన లేదు. కానీ ఉగ్రవాదం, తీవ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తామని కేంద్రం తెలిపింది. రెండు దేశాల ప్రతినిధులు 12వ తేదీన సమీక్ష చేసుకుంటామని ప్రకటించాయి. యుద్ధంలో నష్టపోయిన వారందరికీ సంతాపం తెలుపుతూ తీర్మానం చేద్దాం. దేశ సమగ్రతకు ప్రధాని, కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెలుగుజాతి, ఏపీ ప్రజలు అండగా ఉంటారు' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# ఉగ్రవాదంపై భారత్ వైఖరి మారదు: జైశంకర్

- ఉగ్రవాదంపై భారత్ దృఢమైన, రాజీలేని వైఖరి
- భవిష్యత్తులోనూ ఇదే వైఖరి కొనసాగింపు
- కాల్పుల విరమణ, సైనిక చర్యల నిలుపుదలపై భారత్-పాక్ మధ్య అవగాహన
- కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ప్రకటన



**న్యూఢిల్లీ,మే 10 (వార్తాప్రభ) :** ఉగ్రవాదం విషయంలో భారత్ ఎల్లప్పుడూ దృఢమైన, రాజీలేని వైఖరిని అవలంబిస్తోందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని దాని అన్ని రూపాల్లోనూ భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, భవిష్యత్తులో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తుందని ఆయన తెలిపారు. మరో కీలక పరిణామంగా, కాల్పుల విరమణతో పాటు సరిహద్దుల్లో సైనిక చర్యలను నిలిపివేసేందుకు భారత్, పాకిస్థాన్ మధ్య ఒక అవగాహన కుదిరిందని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే దిశగా ఈ ఒప్పందం దోహదపడుతుందని భావిస్తున్నారు. ఈ మేరకు రెండు దేశాలు పరస్పరం అంగీకారానికి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవగాహన ద్వారా సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు..

## కాల్పుల విరమణ ప్రకటన శుభపరిణామం: సీఎం చంద్రబాబు

**అమరావతి,మే 10 (వార్తాప్రభ) :** భారత్– పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటన శుభపరిణామమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉద్రిక్తతల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి విషయంలో సంతాపం వ్యక్తం చేశారు. దేశ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా మద్దతు తెలపాలని.. దేశమే ముందు అనేది అందరి నినాదం కావాలని పిలుపునిచ్చారు. దేశానికి కష్టమొస్తే సంఘటితంగా ఉండాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. "ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సమస్య ఉగ్రవాదం. దేశ రక్షణ కోసం జరిగిన వీరోచిత పోరాటంలో అగ్నివీర్ మురళీనాయక్ వీరమరణం పొందటం బాధాకరం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ.. ఎవరు మనపైకి వచ్చినా ఉపేక్షించేది లేదు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయభేదాలు ఉన్నా.. దేశ సమగ్రత విషయంలో అందరం ఏకతాటిపైకి రావడం గొప్ప విశేషం. మత విద్వేషాలు లేని రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్" అని చంద్రబాబు అన్నారు.

# నేడు మురళీనాయక్ అంత్యక్రియలు

- సైనిక లాంఛనాలతో నిర్వహించనున్న ప్రభుత్వం ల
- అంత్యక్రియలకు హాజరు కానున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు
- మురళీనాయక్ కుటుంబ సభ్యులకు మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమంత్ పరామర్శ
- గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీనాయక్ వీరమరణం
- మురళీనాయక్ మృతిపట్ల పలు పార్టీల నేతల సంతాపం
- కర్నూలులో విద్యా సంస్థల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**అమరావతి,మే 10 (వార్తాప్రభ) :** పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు ఆదివారం జరగనున్నాయి. శనివారం ఆయన భౌతికకాయం కల్లితండాకు చేరుకుంది. ఈ సందర్భంగా గుమ్మయ్యగారిపల్లి నుంచి భారీ ర్యాలీని నిర్వహించారు. అధికారిక, సైనిక లాంఛనాలతో ఆదివారం జరిగే అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, సత్య కుమార్, పయ్యావుల కేశవ్ , వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్ హాజరు కానున్నారు. ఆయన పార్థివదేహానికి మంత్రులు నివాళులర్పించి మురళీ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.

**మురళీనాయక్ కుటుంబ సభ్యులకు పరామర్శ :** మహారాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సమంత్ శనివారం ఉదయం కల్లితండాకు చేరుకొని మురళీనాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ క్రమంలోనే ఉప ముఖ్యమంత్రి ఏక్?నాథ్? శిందే మురళీ నాయక్ తల్లిదండ్రులతో ఫోన్?లో మాట్లాడి వారిని ఓదార్చారు. వీర జవాన్ కుటుంబ సభ్యులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**సైనికుల క్షేమం కోసం ప్రత్యేక పూజలు :** మరోవైపు శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని ఊరివాకిలి ఆంజనేయస్వామి దేవాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో భారత సైనికుల క్షేమం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యుద్ధంలో అమరులైన సైనికులకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం భారత్ మాతాకీ జై, మురళీనాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

**మురళీ నాయక్ కు ఘన నివాళి :** వీర జవాన్ మురళీ నాయక్ నివాళి కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పాకిస్థాన్ అన్యాయంగా భారత్?పై దాడులు చేస్తుందని జనసేన నేతలు మండిపడ్డారు. ఈ దాడుల్లో మురళీనాయక్ మరణించడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా పాక్?కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**విద్యా సంస్థల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ :** భారత సైనికులకు మద్దతుగా కర్నూలులో ప్రైవేట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని వివేకానంద కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఉపాధ్యాయులు, విద్యా సంస్థల అధినేతలు పాకిస్థాన్?కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కలెక్టర్ కార్యాలయం ముందు ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి యుద్ధంలో మరణించిన వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు.

# అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో జన ఔషధి మందుల షాపులు

- నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ రేట్లకు అందించడం లక్ష్యం
- లాభాపేక్ష లేని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా నిర్వహణ
- ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లోనూ ప్రవేశం పెట్టాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశం



**అమరావతి,మే 10 (వార్తాప్రభ) :** పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రులకొచ్చే రోగుల ప్రయోజనార్థం నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ ధరలకే అందించడానికి అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయంపై సమీక్షానంతరం ఆరోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ నిర్ణయం తీసుకున్నారు. జిజిహెచ్ లలో ప్రస్తుతం జనరిక్ మెడికల్ షాపుల నిర్వాహకులు కొన్ని సందర్భాల్లో 50 నుండి 600 శాతం మేరకు లాభాలతో ఈ మందుల్ని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం 16 జిజిహెచ్ లలో 23 ప్రైవేట్ జనరిక్ మెడిసిన్ స్టోర్లు ఉన్నాయి. నంద్యాల జిజిహెచ్ లో మాత్రం ఇలాంటి స్టోర్ లేదు. ప్రభుత్వాసుపత్రుల్లో జనరిక్ మందుల షాపుల్ని నిర్వహించడానికి లాభాపేక్షలేని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతిపాదనకు మంత్రి ఆమోదం తెలిపారు

**ప్రస్తుత వ్యవస్థలో లోపాలు..** జనరిక్ మందుల తయారీ మరియు వాటి ధరలను నిర్ణయించడంలోని లోపాల్ని ఉపయోగించుకుని ప్రస్తుతం అమ్మకందారులు భారీ లాభాలతో రోగులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం 16 జిజిహెచ్ లలో పనిచేస్తున్న జనరిక్ మెడిసిన్ రిటైలర్లు జనరిక్ ఔషధాల తయారీ, ధరల నిర్ణాయక విధానంలోని లొసుగులను ఉపయోగించుకుంటూ రోగులను దోపిడీ చేస్తున్నారు. దీనికి తోడు ఈ వ్యవస్థపై తగిన నియంత్రణ లేకపోవటం వారికి అనుకూలంగా మారింది. జనరిక్ ఔషధాల తయారీదారులు తమ ఉత్పత్తులపై అధిక ఎంఆర్ పి (గరిష్ట రిటైల్ ధర)ని ముద్రించి సరఫరా చేయడాన్ని అమ్మకందారులు స్వంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. దీంతో రిటైలర్లు వివిధ మందులపై వివిధ ప్రదేశాలలో తమ ఇష్టానుసారం డిస్కౌంట్లను అందిస్తున్నారు. ఈ ప్రక్రియలో వారు 50% నుండి 600% వరకు భారీ లాభాలను ఆర్జిస్తున్నారు. అంతేకాక వారు అవసరమైన జనరిక్ ఔషధాలలో కేవలం 30% నుండి 40% వరకు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. అధిక లాభార్జనను నిరోధించడంతో పాటు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల అమ్మకాలను నిరోధించే తప్పనిసరి బిల్లింగ్ వ్యవస్థ అమలులో లేదు. అటువంటి జనరిక్ ఔషధాల నాణ్యత విషయంలో నియంత్రణ లేకపోవటం కూడా ఆందోళన కలిగించే మరో అంశం. ప్రస్తుతం ఉన్న 23 జనరిక్ దుకాణాలను స్వయం సహాయక బృందాలు మరియు ఇతర సంఘాలకు కేటాయించినప్పటికీ, ప్రైవేట్ వ్యక్తులు వాటిని భారీ లాభాలతో నడుపుతున్నట్లు తెలుస్తోంది.

**జన ఔషధి ప్రయోజనాలు..** ప్రస్తుత వ్యవస్థలోని లోపాలను పరిష్కరించి, దేశవ్యాప్తంగా రోగులకు సరసమైన ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలను సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి– భారతీయ జన ఔషధి పరియోజన' (పిఎం–బిజెపి)ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద, భారత ప్రభుత్వ ఔషధాల శాఖ జన ఔషధి దుకాణాలకు సరఫరా చేయడానికి ముద్రించిన ప్రామాణిక గరిష్ట విక్రయ ధరతో జనరిక్ ఔషధాలను కొనుగోలు చేస్తుంది. వీటిని 15% లాభ మార్జిన్‌తో మాత్రమే జన ఔషధి కేంద్రాలు విక్రయిస్తాయి. ఇది రోగులకు భారీగా ప్రయోజనం చేకూరుస్తుంది. ప్రతి అమ్మకాన్ని కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలి. తద్వారా రిటైలర్లు జనరిక్ ఔషధాల అమ్మకపు ధరలను మార్చటానికి వీలుండదు. చాలా అరుదైన సందర్భాలలో తప్ప జన ఔషధి దుకాణదారులు ఖరీదైన బ్రాండెడ్ మందులను విక్రయించరు. సంబంధిత అధికారుల ఆమోదంతో కొన్ని వ్యాధులకు జనరిక్ మందులు అందుబాటులో లేనప్పుడు మాత్రమే బ్రాండెడ్ మందులను విక్రయిస్తారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో ప్రవేశపెట్టబోయే ఈ జన ఔషధి కేంద్రాలకు సంబంధించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తగు అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా స్థాయి బ్రాంచ్‌లకు కలెక్టర్లు ఛైర్మన్లుగా ఉంటారు సెకండరీ ఆసుపత్రుల్లో కూడా జన ఔషధి కేంద్రాల్ని ప్రవేశపెట్టాలని మంత్రి ఆదేశించారు.

# దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు జర్నలిస్ట్ సంఘాల ఘన నివాళి




**విజయవాడ,మే 10 (వార్తాప్రభ) :** దేశ రక్షణ కోసం పాకిస్తాన్ సేనలతో పోరాడుతూ అసువులు బాసిన వీర సైనికులకు జర్నలిస్టు సంఘాల నాయకులు ఘన నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన గౌరవ మురళీ నాయక్, మహారాష్ట్రకు చెందిన గౌరవ సచిన్ యాదవ్ రావు, భారత అడిషనల్ డిప్యూటీ కమిషనర్ రాజకుమార్ లకు "విజయవాడ ప్రెస్ క్లబ్ అందరిదీ" సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పత్రిక సంపాదకుల సంఘం అధ్యక్షులు కే ప్రసాద్ బాబు అధ్యక్షతన ఘన నివాళులర్పించారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న పాక్ దుశ్చర్యలు ప్రపంచ దేశాలు గమనించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరాం యాదవ్ కోరారు.మన దేశంపై తరచుగా టెర్రరిస్టు దాడులకు కారణభూతమవుతున్న పాకిస్తాన్ కు ఆజన్మాంతం గుర్తుండేలా ఈసారి దేశ రక్షణ దళాలు తో తగు ప్రతీకార చర్యలు చేపడుతున్న ప్రధాని మోడీకి శ్రీ రామ్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై ఎటువంటి చర్యలు చేపట్టిన ప్రతి పౌరుడు ప్రభుత్వానికి మద్దతు తెలపాలని, ఉగ్రవాదంపై పోరాడుతూ వీరమరణం పొందిన వీర సైనికుల కుటుంబాలకు ప్రభుత్వము, దేశ ప్రజలు అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాకమాను వెంకట వేణు కోరారు. భారత రక్షణ దళానికి దివంగత సైనికులు చేసిన త్యాగాలకు దేశం గర్వపడుతుందని,వారి త్యాగం దురహంకార పాకిస్తాన్ కు గుణపాఠం చెబుతుందని విజయవాడ జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏవివి శ్రీనివాసరావు అన్నారు. వీర జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని వారు మౌనం పాటించి, జై జవాన్... జై భారతదేశం... అంటూ జర్నలిస్ట్ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నగర అధ్యక్షులు తాళ్లూరి అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి "అంతరాత్మ" శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగోతి శ్రీనివాసరావు, టి బాలాజీ, పి వెంకట్ , చారి నగర నాయకులు ఆర్ కోటేశ్వరరావు, సి పనేంద్ర, బి బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామికాభివృద్ధే మా ప్రభుత్వ లక్ష్యం -మంత్రి నారాయణ



**విజయవాడ,మే 10 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు . .పరిశ్రమలు స్థాపించే వారికి అన్ని రకాల వసతుల కల్పిస్తామన్నారు .స్థలం సమస్య తలెత్తకుండా ఒకే కాంప్లెక్స్ లో క్లస్టర్ లు, యూనిట్లు నెలకొల్పేందుకు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు . నెల్లూరు భగత్ సింగ్ కాలనిలో 12 కోట్లతో ప్రయోగాత్మకంగా నిర్మించనున్న ఎంఎస్ ఎం ఈ ప్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్ కు శనివారం సాయంత్రం మంత్రి నారాయణ శంఖుస్థాపన చేసారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతా ఈ ప్రాంతంలోనే 1400 కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు .భగత్ సింగ్ కాలనీ వాసుల ఆనందానికి అవధుల్లేవన్నారు .రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం గా సీఎం చంద్రబాబు నాయుడు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రతీ ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమని చెప్పారు . పేద మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని సీఎం నిర్ణయించారన్నారు .అన్ని నియోజక వర్గాల్లో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని ,రాష్ట్రం లోనే మొదటిసారిగా నెల్లూరు సిటీలో ప్లోటెడ్ ఫ్యాక్టరీ కి శంఖుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు.

# ఎడిటోరియల్

## పీవోకే భారత్ లో విలీనం కావాల్సిందే !

పాక్ ఆక్రమిత కాశ్మీర్ షార్ట్ కట్ లో పీఓకే. అసలు కాశ్మీర్ అన్నది 1947 నాటికి ఒక స్వతంత్ర రాజ్యం. దానిని భయపెట్టి బెదిరించి తమలో కలుపుకోవాలని కొత్తగా ఒక దేశంగా ఆనాడు ఏర్పాటు అయిన పాక్ చేయాల్సింది అంతా చేసింది. అయితే కాశ్మీర్ ని ఏలుతున్న రాజు భారత్ తోనే ఉంటేనే తమకు మనుగడ క్షేమం అనుకుని భారత్ వైపు మొగ్గు చూపాడు. అలా భారత్ లో కాశ్మీర్ చేరడం జరిగింది. అయితే ఇది గిట్టని పాకిస్థాన్ కాశ్మీర్ మీద యుద్ధం చేసి తమలో కలిపేసుకోవాలని చూసింది.ఆ సమయంలో భారత్ తన సైన్యాన్ని కాశ్మీర్ కి పంపించి పాక్ తో యుద్ధం చేసింది. అలా పాక్ ని తరిమికొట్టింది. అయితే అందులో మూడవ వంతు భూభాగాన్ని పాక్ ఆక్రమించుకుని కూర్చుంది. భారత్ లో విలీనం అయిన కాశ్మీర్ వద్ద రెండు వంతులు భూభాగం ఉంది.ఇది జరిగి దాదాపు ఎనభై ఏళ్ళు గడుస్తున్నా పాక్ ఆక్రమిత కాశ్మీర్ ని మాత్రం భారత్ తిరిగి తెచ్చుకో లేకపోతోంది. ఆ లోటు అలాగే ఉంది. ఈ మధ్యలో 1965లో పాక్ తో భారత్ జరిగిపిన యుద్ధంతో భారత్ గెలిచింది. అయినా ఆక్రమిత కాశ్మీర్ ని తెచ్చుకోలేదు. 1971లో అయింతే పాక్ భూభాగం మీదనే వెళ్ళి లాహోర్ దాకా భారత్ సైనికులు కదం తొక్కి పాక్ కి శృంగభంగం చేశారు. అయినా ఈసారి కూడా పాక్ ఆక్రమిత కాశ్మీర్ ని వెనక్కి తెచ్చి కలుపుకోలేదు. 1999లో కార్గిల్ యుద్ధం లో భారత్ విజేతగా నిలిచినా పీఓకే అన్న ఇష్యూ రాకుండానే ముగిసింది.ఇక ఇపుడు చూస్తే అన్ని విధాలుగా భారత్ కి అనుకూలత ఉంది. ప్రపంచంలోని కొన్ని అగ్ర రాజ్యాలు భారత్ పాక్ యుద్ధం మీద సన్నాయి నొక్కులు నొక్కవచ్చు. మరికొన్ని దేశాలు ముఖం మీద నవ్వు తెర వెనక విషం చిమ్మవచ్చు. ఎవరు ఏమి చేసినా ఇది భారత్ సార్వభౌమాధికారానికి సంబంధించిన సమస్య. అందువల్ల భారత్ ఈ యుద్ధంలో సాధించాల్సింది ఏంటి అంటే పీఓకేని వెనక్కి తెచ్చుకుని భారత్ లో కలుపుకోవడం అని అంతా అంటున్నారు.ఇది ఏకంగా 146 కోట్ల మంది భారతీయుల కోరిక. ఇది భారత్ ప్రతిష్టను పెంచే అంశం. ఇది ఉగ్రవాదానికి శాశ్వతంగా ముకుతాడు వేసే విషయం కూడా. తనది కాని ఆస్తిని ఎవరికో రాసి ఇచ్చినట్లుగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో చైనాకు కొంత భూభాగం ఇచ్చింది. అలా చైనా తన దేశం నుంచి పీవోకే దాకా రోడ్లు వేసింది.పీవోకేను స్వాధీనం చేసుకుని చైనా వైపు ఉండే రోడ్లను మూసివేసి మిగిలిన దానిని మొత్తం భారత్ వాడుకోవాలి. అక్కడ కొండ ప్రాంతం ఎక్కువ కాబట్టి జనాభా తక్కువగానే ఉన్నారు. ఇక గత ఏడున్నర దశాబ్దాలుగా వారి మేలు కోసం పాక్ ఏమీ చేసింది లేదు. వారు కనుక భారత్ తో ఉంటామని అంటే కలుపుకోవాలి. లేదా వారు పాక్ లోకి వెళ్తామంటే వారి ఆప్షన్ కే వదిలిపెట్టాలి.అలా సంపూర్ణ కాశ్మీర్ ని సాధించడమే కాకుండా వ్యూహాత్మకంగా భారత్ కి ఎంతో కలసి వచ్చే పీవోకేని స్వాధీనంలో ఉంచుకుని అక్కడ భారత జవాన్లతో కీలక ప్లేస్ లలో పోస్టులు ఏర్పాటు చేయడం ద్వారా ఉగ్రవాదుల పీడను శాశ్వతంగా వదిలించుకోవచ్చు అన్నది మాజీ సైనిక అధికారులు చెబుతున్న మాట. ఇదే మొత్తం దేశం మాటగా ఉంది.ఆ మధ్యన దేశ రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కూడా పీవోకే స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. సో అది ఇపుడు నిజం కాబోతోంది అని అంతా ఆశాభావంతో ఉన్నారు. పాక్ పహల్గాం దాడిని ఉగ్రవాదులతో చేయించిన దానికి ఇది సరైన గుణపాఠంగా కూడా ఉంటుందని అంటున్నారు. పీఓకే స్వాధీనంతో పాక్ కోరలు విరిచినట్లు అవుతుంది అని అంటున్నారు.పీవోకే ఎటూ భారత్ భూభాగం కాబట్టి అంతర్జాతీయ సమాజం కూడా భారత్ ని ఏ విధంగానూ తప్పు పట్టే అవకాశం ఉండదని అంటున్నారు. సో ఆ విధంగా భారత్ విజయకేతనం ఎగురవేయాలని అంతా గట్టిగా కోరుకుంటున్నారు. ఆ రోజు తొందరలోనే వస్తుందని ధీమాగా కూడా భారతీయులు అంతా ఉన్నారు.

## మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన మురళి నాయక్ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుంది

**మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన.ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య**




**జగ్గయ్యపేట మే 10 (వార్తప్రభ)**పట్టణం, కోదాడ రోడ్డులో గల మార్కెట్ యార్డు నందు రైతులు మరియు నాయకులు తో కలిసి భారత సైన్యంలో విధులు నిర్వహిస్తూ శ్రీ సత్యసాయి జిల్లా కి చెందిన మురళి నాయక్ అనే సైనికుడు అమరుడయ్యారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య).ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, డీసీ చైర్మన్ ఏలూరి గోపాలరావు, డీసీ వైస్ చైర్మన్ మన్నె నారాయణరావు, వార్డు కౌన్సిలర్ పేరం సైదేశ్వర రావు, హరి నరసింహారావు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు సైనికుడు

దేశానికి రక్షకులు
మన ప్రియతమ సైనికులు
దేశ సరిహద్దుల్లో
భారతమ్మ కనురెప్పలు
జీవితమంతా త్యాగం
అదే వారికి సొంతం
అడుగడుగునా అవుతుంది
ఆదర్శమే జీవితం
వీర మరణమొందినా
అమరులే లోకంలో
జీవించే ఉంటారు
భారతమ్మ గుండెలో
వారి సమర్పణ గొప్పది
గౌరవింపదగినది
ఆచరింపదగినది
బహు అమూల్యమైనది
సైనికుడా! ధన్యుడవు
అందరికి స్ఫూర్తి దాతవు
భువిని చిరస్మరణీయుడవు



సైనికుడా! ఆరాధ్యుడా!

**గద్వాలసోమన్న**

సెల్:9866414580

## బహరైన్ దేశంలో ఘనంగా శ్రీ పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి వేడుకలు

- బహరైన్ తెలుగు కళా సమితి అధ్వర్యంలో ఘనంగా శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం
- ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్







**విజయవాడ పశ్చిమ మే 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అదేశాలు మేరకు అమరజీవి పొట్టిశ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఏడాది పాటు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగానే ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఉన్న దేశాలల్లో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించడం తెలుగు వారి బాధ్యత గా భావిస్తున్నారు. అంతర్జాతీయంగా తొలిసారిగా బహరైన్ దేశంలో తెలుగుకళాసమితి అధ్యక్షులు పి.జగదీష్ అధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రసాధన కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు ఆయన త్యాగం మరువలేనిదని అన్నారు. పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. తెలుగువారి క్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అర్పించిన త్యాగమూర్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీపొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను వీడియో రూపంలో ప్లే చేయడం జరిగింది..కార్యక్రమానికి బహరైన్ దేశంలోని తెలుగు ప్రజలు భారీగా పాల్గొన్నారు.ఏ దేశంలో ఉన్నా అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం మరువకుండా తెలుగోళ్లు పొట్టి శ్రీరాములు కి ఇంతటి ఘనమైన నివాళులు అర్పించడం చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ అక్కడ ప్రజలను,వారి విశ్వసనీయతని కొనియాడారు.

## భక్తుల సౌకర్యాలు పై దృష్టి సారించిన దుర్గ గుడి ఆలయ కార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్

- అన్ని విభాగాల్లో అలుపెరుగని సుడిగాలి పర్యటన
- అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పరుగో పరుగులు







**విజయవాడ పశ్చిమ మే 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ ఇంద్రకీలాద్రి పై కార్యనిర్వాహణాధికారి వి కే శీనానాయక్ భక్తుల సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నారు. దానిలో భాగంగా శనివారంఉదయం ఇంద్ర కీలాద్రి పరిసరాల్లో అన్ని విభాగాల్లో స్వయంగా పర్యటించారు. దాంతో పలు విభాగాల అధికారులు, సిబ్బంది పరుగులు తీయాల్సి వచ్చింది. తొలుత శ్రీ దుర్గా స్నానఘాట్ పరిశీలన చేసి,పవిత్ర కృష్ణా నదిలో నీటిమట్టం తగ్గుతున్నందున భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవలసినదిగా ఆదేశించారు.స్నానాల రేవులో మహిళా భక్తుల నిమిత్తం దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు మరామత్తులు పూర్తి చేసి త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.పారిశుద్యం విషయంలో మరింతగా చర్యలు తీసుకొని శుభ్రంగా ఉంచాలని పారిశుధ్య విభాగం వారిని ఆదేశించారు. అలాగే దుర్గా ఘాట్లో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి వగైరా అమ్మే హాకర్స్ ని ఒక క్రమపద్ధతిలో పెట్టాలని, భక్తులకు విక్రయించే ధరల విషయంలో తేడా ఉండకూడదని లీజెస్ సిబ్బందికి ఆదేశించారు.తలనీలాలు సమర్పించే భక్తులకు కేశ ఖండనశాలలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, భక్తులతో మర్యాదగా మెలిగేలా చూడాలని కేశ ఖండనశాల సిబ్బందికి పలు ఆదేశాలు చేశారు. అలాగె కుమ్మరిపాలెం సెంటర్ లో గల ఖాళీ స్థలం గురించి ఇంజినీరింగ్ అధికారులను అడిగి,భక్తుల సౌకర్యార్థం రూపొందించిన ప్రతిపాదనల స్థితి తెలుసుకున్నారు.మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా గల కొండ ప్రాంతం పరిశీలించి, రెండవ ఘాట్ రోడ్ గురించి రూపొందించిన ప్రతిపాదనలు గురించి వివరాలు తెలుసుకున్నారు.ఆలయ భద్రతలో కీలకమైన శివాలయం దిగువ మెట్లు, రుద్రాహోమం మండపం ప్రాంతం పరిశీలన చేసి, ఉత్తరం వైపు మెట్లు దారిలో, గతంలో ఉన్న సిబ్బంది నివాససముదాయం ప్రాంతం భద్రత రీత్యా ఉపయోగంలోకి తీసుకురావాలని అంశాలపై పరిశీలన చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.కొండపైన అక్షరాబ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించే మండపం పరిశీలన చేసి, భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, భక్తుల సెంటిమెంట్ గౌరవిస్తూ, శాస్త్రోక్తంగా కార్యక్రమాలు పూర్తి చేయాలని అర్చకులను ఆదేశించారు. భక్తులతో సంభాషించి, చిన్నారులను పలుకరించారు.కొండమీద వివిధ ప్రాంతాల్లో గల మంచినీటి కూలర్స్ పరిశీలన చేసి, ఎప్పుడు శుభ్రం చేశారో అనేది ట్యాంక్ మీద వ్రాయించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఉచిత ప్రసాదం పంపిణీ పరిశీలన చేసి, భక్తులు అందరికి అందేలా చూడాలని ఆదేశించారు.నిర్మాణంలో ఉన్న యాగశాల,పూజా మండపాలు పరిశీలన చేసి, భక్తులకు త్వరితగతినఅందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

## పాకిస్థాన్ పై యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళి నాయక్ కి ఘనంగా నివాళులర్పించిన సామినేని ఉదయభాను





**విజయవాడ పశ్చిమ మే 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ, కాళేశ్వర మార్కెట్ సెంటర్ లో ఆపరేషన్ సింధూర్ లో భాగంగా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో పాకిస్తాన్ పై జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన వీర జవాన్ మురళి నాయక్ కి జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా జవాన్ మురళి నాయక్ వీర మరణం చెందారన్నారు. చిన్న వయస్సులోనే జవాన్ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీ నాయక్ కి దేశ ప్రజలందరూ స్వచ్ఛందంగా నివాళులు అర్పిస్తున్నారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. వీర మరణం పొందిన మురళి నాయక్ మృతిపై సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా స్పందించారని, వారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. దేశ ప్రజలందరు ఈ విపత్కర సమయంలో సైన్యానికి అండగా ఉండాలని కోరారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శులు అమ్మిశెట్టి వాసు, ఏపీఐఐసీ స్టేట్ డైరెక్టర్ మండలి రాజేష్, సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, కార్పొరేటర్ మహదేవపు అప్పాజీ మాట్లాడుతూ జనసేన పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గరికపాటి శివశంకర్, డాక్టర్ కొండవీటి సంతోష్ కృష్ణ, పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పి ఏ సి) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతిరెడ్డి అనిత నగర జనసేన కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, ఉమ్మడిశెట్టి బహుదూర్, అత్తులూరి పెదబాబు, విజయవాడ జనసేన పార్టీ నగరానికి చెందిన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

## భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల దృష్ట్యా ఎన్టీటిపీఎస్ లో మాక్ డ్రిల్



**ఇబ్రహీంపట్నం మే 10(వార్తా ప్రభ ప్రతినిధి):**భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల దృష్ట్యా ఎపిజెన్కో మేనేజింగ్ డైరెక్టర్ కే ఎన్ వి చక్రధర బాబు ఆదేశాల మేరకు డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రములో సి - కాలనీ లో పి శివ రామాంజనేయులు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎటువంటి పరిస్థితినైన ఎదుర్కొనే విధంగా ఉండేలా ముఖ్యంగా, విపత్కర పరిస్థితులలో ఏవిధమైన చర్యలు తీసుకోవాలో ఈ మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. తనను తాను కాపాడుకుంటూ పక్క వారిని కాపాడాలని అందుకు పూర్తి సంసిద్ధంగా ఉండాలని వివరించారు.ఈ కార్యక్రమ సంధాన కర్తగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సేఫ్టీ, యమ్ నాగబాబు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విటిపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి మరొక ముందడుగు

**- జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు.**
**- డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం.**



**మచిలీపట్నం మే 10 (వార్తాప్రభ ప్రతినిధి)**జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించిన "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు చరవాణి ద్వారా నేరుగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటికి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం పోలీస్ శాఖ యొక్క ప్రథమ బాధ్యత అని, డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం ద్వారా ప్రజలకు నేరుగా న్యాయం కల్పించడమే మా బాధ్యత అన్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, చట్ట పరిధిలో పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అనేక మంది తమ వ్యక్తిగత సమస్యలు, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, సివిల్ వివాదాలు ఇతర రకాలైన అంశాలపై ఫిర్యాదులు చేశారు అని తెలిపారు. వాటిపై సంబంధిత అధికారులకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, అన్ని ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేసే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. సమాజం, కుటుంబ పరంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

## హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తూ వక్ఫ్ బోర్డ్ స్థలంలో అక్రమ నిర్మాణాలు

**మజులుమ్ షా ధర్వేష్ మస్జిద్ ముత్తవల్లి సయ్యద్ గులాం గౌస్**




**ఇబ్రహీంపట్నం 10(వార్తా ప్రభ ప్రతినిధి):** హైకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ వక్ఫ్ బోర్డు స్థలంలో ఒక సంస్థ వారు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు కొండపల్లి మజులుమ్ షా ధర్వేష్ మస్జిద్ ముత్తవల్లి సయ్యద్ గులాం గౌస్. ఇందుకు సంబంధించిన కేసు వివరాలు వివరిస్తూ మండల పరిధిలోని గుంటుపల్లి సర్వే నెంబర్ 249/1B1B లో 45 ఎకరాల్లో 14 ఎకరాలు మజులుమ్ షా ధర్వేష్ తకియ మరియు మస్జిద్ చెందిన వక్ఫ్ స్థలం ఆక్రమణ గురి అయింది. దీనిపై మస్జిద్ ముత్తవల్లి సయ్యద్ గులామ్ గౌస్ వక్ఫ్ ట్రిపులను ఆశ్రయించారు. దీనిపై విచారించిన వక్ఫ్ ట్రిపునల్ అది వక్ఫ్ బోర్డు స్థలంగా గుర్తించి విచారణ మూసే వరకు ఇక్కడ అలాంటి నిర్మాణాలు చేయొద్దని గత సంవత్సరం జనవరి లో ఆదేశాలు జారీ చేసింది. దీనిపై హైకోర్టు ను ఆశ్రయించగా తీర్పు వెలువడేవరకు వాదాస్పద స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. వీటిని బేఖాతర్ చేస్తూ, హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో అదును చూసుకొని వక్ఫ్ బోర్డు స్థలంలో శనివారం నాడు నిర్మాణాలు చేపట్టారు యాజమాన్యం. దీనిపై స్థానిక పోలీసులు కూడా ఫిర్యాదు చేసినట్లు గులాం గౌస్ తెలిపారు.

## విద్యుత్ చార్జీల పేరుతో నిలువు దోపిడి

**డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్ కె బాషా**

**ఇబ్రహీంపట్నం, మే 10(వార్తా ప్రభ ప్రతినిధి):** విద్యుత్ చార్జీల పేరుతో నిలువు దోపిడి జరుగుతుందని, రాష్ట్రంలో వేసవి ఎండలకు ప్రజలు బెంబేలెత్తుతుంటే, మరోవైపు విద్యుత్ బిల్లులు చూసి ప్రజలు భయపడుతున్నారని మండిపడ్డారు డివైఎఫ్ఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎస్ కె బాషా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నది,ట్రూ అప్,సర్దుబాటు చార్జీలు,ఎఫ్ పి పి సి ఏ, ఇలా రకరకాల పేర్లతో ప్రజల జేబులకు చిల్లులు పెడుతుందన్నారు. ప్రజలు,వ్యాపారస్తులు, కార్మికులు,బడుగు,బలహీన వర్గాలు అందరూ పనులు లేక ఇబ్బందులకు గురవుతున్న సమయంలో,మోసపూరిత పద్ధతుల్లో ఫిక్స్ చార్జీలు,కస్టమర్ చార్జీలు,విద్యుత్ సుంకం ఇలా



విడివిడిగా భారాలు వడ్డిస్తున్నారు,ట్రూ అప్ సర్దుబాటు చార్జీల రూపంలో మరో బాదుడు, ఇది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ బాదుడు,మరల మీ డిపాజిట్ చాలా లేదని అదనపు డిపాజిట్ పేరుతో మీఇంట్లో టీవీ,ఫ్రిడ్జ్,ఏసి ఉంటే అదనపు లోడు పేరుతో డెవలప్మెంట్ చార్జీలకు నోటీసులు ఇస్తూ,ఇలా ఒకటి కాదు జనాన్ని పలు రూపాల్లో పీల్చి పిప్పి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాల నుంచి ప్రజలను ఉపశమనం కలిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆక్రమణలు తొలగింపు...

**ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయుటలో ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులకు వెన్నతో పెట్టిన విద్యే...**





**గుంటూరు మే 10 ( వార్తాప్రభ ప్రతినిధి ):–** గుంటూరు జిల్లా ఎ.స్పీ యస్. సతీష్ కుమార్ ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ కు నిరంతరం అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణదారులపై కొరడా ఝులిపించాలని ఆజ్ఞప్తి మేరకు సత్వరమే స్పందించన ఈస్ట్ ట్రాఫిక్ సి.ఐ ఆకుల అశోక్ కుమార్ శనివారం నాడు తమ సిబ్బందితో కలిసి యన్.టి.ఆర్ సర్కిల్ వద్ద మరియు కాసు బ్రహ్మానందరెడ్డి స్టేడియం కూడలిలోను అట్లాగే కోడిగుడ్ల సెంటర్ ఏరియాతో పాటు మాయాబజార్, పాత బస్టాండ్ సెంటర్లలో హద్దుమీరి వారి వారి హుంగుబలంతో ఇష్టానుసారంగా రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన ఆయా వ్యాపారస్థుల ఆక్రమ ఆక్రమణలను ఉన్న ఫణంగా తొలగింపు చేయుటంతో పాటు ఏరోజుకారోజే రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదరికంలో తోపుడు బండ్లు పై వ్యాపారాలు చేసుకునే వర్తకులకు వాళ్ళ భుక్తికి ఎలాంటి కడుపు కోత కోయకుండా బడుగు జీవుల వ్యాపారానికి అనువైన ఉన్మార్గాన్ని చూపి , చిరు వ్యాపారులు ఉసూరు మనకుండా వాళ్ళ మోములో ఆనందాన్ని పండించి , ఇకనుంచి ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ కూడలిలోనైనను ట్రాఫిక్ కు కూసింత అంతరాయం ఏర్పడకుండా తగు మెలుకువలతో విశేష కృషితో కూడిన విధులను నిర్వర్తిస్తుండం దృశ్య మాలికను వీక్షించిన రవాణా దారులు నిత్యం ఎదురౌతున్న ట్రాఫిక్ కష్టాలు ఒడ్డెక్కడంతో ముసి ముసి నవ్వులొలికిస్తూ రాజు తలుసుకుంటే కార్యాచరణకు కొదమేముంది అంటూ ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు పని తీరుపై అమితమైన ప్రేమాభిమానాన్ని వ్యక్తం చేస్తూ శభాష్ ట్రాఫిక్ పోలీసులు అంటూ ప్రసంగిస్తున్నారు. ఈ సందర్భంగా ఈస్ట్ ట్రాఫిక్ సి.ఐ మీడియాతో మాట్లాడుతూ రోడ్డుపైకి ఇష్టారాజ్యంగా చొచ్చుకొచ్చి ట్రాఫిక్ కు అంతరాయం కల్గించిన యెడల అట్టి వారిని ఉపేక్షించబోమని తక్షణమే ట్రాఫిక్ పోలీస్ వారు శాఖాపరంగా తీసుకొను తగు చర్యలకు బాధ్యులు కాగలదని తమదైన శైలిలో నిర్మోహమాటంగా ఘాటుగా హెచ్చరికలు జారీ చేశారు. ట్రాఫిక్ పోలీస్ వారి విన్నపాన్ని ఆయా వర్తకులు సహృదయంతో స్వీకరించి ఒక క్రమబద్ధంగా వారి వారి వ్యాపారాలు చేసుకుంటూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమములో ఈస్ట్ ట్రాఫిక్ యస్.ఐ.లు రవీంద్ర బాబు, కోటేశ్వరరావు, పలువురు ఏ.యస్.ఐ లతో పాటు హెడ్ కానిస్టేబుల్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీ సెంటర్ కల నెరవేర్చనున్న మంత్రి

**● ఆగిరిపల్లి మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కొలుసు పార్థసారథి.**







**ఆగిరిపల్లి : మే:09(వార్త ప్రభ )**ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామంలో శనివారం ఉదయం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాలు, శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గ్రామంలోని తనను కలవడానికి వచ్చిన ప్రతీ వారిని ఆప్యాయంగా పలకరించి, వారు చెప్పే సమస్యలను సావధానంగా ఆలకించి, అక్కడికక్కడే సంబంధిత అధికారులకు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. శనివారం గ్రామంలోని కొంతమంది వృద్ధులు తాము పేదరికంలో ఉన్నానని,కొంతమంది చేతి వృత్తి పని చేస్తున్న వారు తమకు బి, సి,కార్పోరేషన్ నుండి ఋణాలు అందించమని కోరగా, కొంతమంది తనకు స్వంత ఇల్లు లేదని, తనకు ఇల్లు మంజూరు చేయాలనీ కోరగా,తక్షణమే పరిశీలించి ఇంటి స్థలం మంజూరు చేయాలనీ రెవిన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు. ఋణాలు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రి,కొంతమంది గ్రామంలో అంగన్వాడీ సెంటర్ లేదని అంగన్వాడీ సెంటర్ నిర్మించాలని కోరగా తక్షణమే అధికారులకు ఆదేశించిన మంత్రి,కొంతమంది వృద్ధప్య పింఛను కావాలని కోరగా మండల అభివృద్ధి అధికారికి హర్హులైన వారికి ఫించన్లు మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు, అధికారులకు ఆదేశించిన మంత్రి పట్ల గ్రామస్తులు తమ హర్షాన్ని కృతజ్ఞతను ఆనందాన్ని వ్యక్తం చేశారు,ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు తమకు గతంలో టిడిపి ప్రభుత్వం సమయంలో పేదలకు స్థలాలు మంజూరు చేశారని , వాటిలో కొంతమంది ఇళ్ళు నిర్మించుకున్నారని, కొంతమంది ఇల్లు ప్రారంభదశలో ఉండగా, తదనంతరం వచ్చిన వై.ఎస్.ఆర్.సి,పి నాయకులు సదరు ఇళ్లకు బిల్లులు చెల్లించలేదని, ప్రారంభ దశలో ఇళ్ల ఉన్నవాటిని కూడా నిర్మాణ పనులు పూర్తి చేయనివ్వలేదన్నారు. తమ సమస్యను పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ సమస్య రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉందని, తాను ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, సదరు బిల్లులు చెల్లింపులకు, ప్రారంభ దశలో ఉన్న ఇళ్లకు కొత్త ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. గ్రామంలో స్వంత ఇల్లు లేని పేదల వివరాలు తనకు సమర్పించాలన్నారు. మార్చి నెల తరవాత కేంద్ర ప్రభుత్వం పేదల ఇళ్ల యూనిట్ కాస్ట్ ను 4 లక్షల రూపాయలకు పెంచుతుందని, ఆ సమయంలో ఇళ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. గ్రామంలోని కొంతమంది వృద్ధులు ఫెంక్షన్ రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకొని రాగా వెంటనే సంబంధిత అధికారులకు హర్హులైన ప్రతీ ఒక్కరికి ఫెంక్షన్ మంజూరు చేయాలని ఆదేశించిన మంత్రి కొంతమంది వృద్ధులు వృద్ధప్య పింఛను ఇప్పించవలసినదిగా కోరగా తక్షణమే అధికారులకు ఫోన్ చేసి అర్హులైన అందరికి పింఛన్లకోసం ఆన్ లైన్ చేయమని ఆదేశించిన మంత్రి పట్ల తమ హర్షాన్ని కృతజ్ఞతను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, వేణు,కూటమి నాయకులు, ప్రభృతులు పాల్గొన్నారు.

# నువ్వు లేకపోయినా నీ వీరత్వం మిగిలే ఉంది మురళీ నాయక్!



వీర జవాన్ మురళీనాయక్ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాడు. పేదవాడైనా, మారుమూల తండాలో పుట్టినా దేశ సేవలో కన్నుమూశారు. మిలటరీ దుస్తుల్లోనే ఊపిరి వదలాలని పదేపదే చెప్పే మురళీ చివరకు ఆ విధంగానే కన్నుమూశారు.

చరిత్రలో సజీవంగా నిలిచారు.

**ఓ తండా ఆశ.. ఓ దేశ గర్వం**కల్లితండా, శ్రీ సత్యసాయి జిల్లా ..తేదీ 2025, మే 9.. సమయం ఉదయం 9 గంటలు.. గిరిజన తండాలోని శ్రీరాం నాయక్ ఫోన్ మోగింది. ఫోన్ వింటూనే శ్రీరాం నాయక్ కుప్పకూలిపోయారు. గుండెలవిసేలా రోదన.. ముంబయి నుంచి వచ్చి తండాలో జరిగిన జాతరలో సంతోషంగా గడిపేందుకు వచ్చిన శ్రీరాం నాయక్ కుటుంబం పాలిట పెను విఘాతమైంది ఆ ఫోన్ కాల్. ఆ కాల్ సారాంశం.. భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన కాల్పుల్లో వారి కుమారుడు మురళీనాయక్ కన్నుమూత. ఈ ఫోన్ కు కాస్త ముందే మురళీ నాయక్ వీడియో కాల్ చేసి తల్లిదండ్రులతో మాట్లాడిన మాటలు చెవుల్లో మార్మోగుతుండగానే ఈ విషాదకర వార్త రావడంతో తల్లడిల్లారు. కానీ ఆ తండ్రి శ్రీరాంనాయక్ చెబుతున్న మాట మాత్రం ఈ దేశ ప్రజలు గర్వపడేలా ఉన్నాయి.. "అతడు మాకోసం కాదు నాయనా.. దేశం కోసం బతికాడు" అని ఆ తండ్రి చెప్పినపుడు అక్కడున్న వాళ్లందరి కళ్లంట నీళ్లు చెమ్మగిల్లాయంటే అతిశయోక్తి కాదు.

**తండ్రి చెమట, తల్లి కన్నీటి కల** మురళీ నాయక్ తల్లిదండ్రులు ముంబయిలో కూలి పనులు చేస్తూ తన చదువు కోసం రెక్కలు ముక్కలు చేసుకున్నారు. కొడుకు కోసం ఎన్ని కష్టాలు పడ్డారో చెప్పనలవి కాదు. తండ్రి భవన నిర్మాణ కూలి. తల్లి ఇళ్లలో పాచిపని.. తండాలో అమ్మమ్మ దగ్గర పెరిగిన మురళీ.. స్కూల్‌కు వెళ్లే సమయంలోనే 'మిలటరీ దుస్తులు వేసుకుంటా' అని చెప్పేవాడు. ఇంటర్ పూర్తయిన తరువాత బీకాం చదువుతున్న సమయంలో 2022 డిసెంబర్ లో గుంటూరు అగ్నిపథ్ ఎంపికలో సెలెక్ట్ అయ్యాడు. రైల్వేలో ఉద్యోగం వచ్చినా వదిలేసి దేశసేవే అతనికి ప్రాణం అయింది.

**కలలు కన్న ఊరి మట్టి..** జమ్మూకశ్మీర్ లోయల్లో మే 9న తెల్లవారుజామున 2:30 ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో మురళీ నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఢిల్లీకి విమానంలో తరలించే మార్గంలోనే తుదిశ్వాస విడిచాడు.ఆ వార్త తండాకు చేరుకున్నదే తడవుగా ఊరు మొత్తం మౌనంగా రోదించింది. నాయక్ చిత్రపటాన్ని గుండెలకు హత్తుకుంది. నాయక్ ఫోటో ఆ ఊరి జనం కళ్లను మసకబార్చింది.

ఇటీవలే తండ్రి ఇంటిని నిర్మించాడు. వధూవరులుగా నిలిచే స్వప్నాలను గదిలో గోడలపై రేకులు వేసేలా మాట్లాడుకున్న తల్లిదండ్రులకు ఇక ఆ ఇంటిలో జీవనం మిగలదు.

**"యూనిఫాంతోనే చనిపోవాలని ఉంది"** ఈ మాట మురళీ నాయక్ చాలా సార్లు అన్నాడు. "ఒక్కరోజైనా మిలటరీ సర్వీస్ చేయాలి" అన్న కలను వదలకుండా సాగిన జీవితం – ఇప్పుడు దేశ గర్వంగా నిలిచిపోయేలా చేసింది. అంత్యక్రియల కోసం గ్రామమంతా తరలివస్తోంది. చుట్టుపక్కల గ్రామాల వారూ వీర తిలకం దిద్దేందుకు క్యూలు కట్టారు. మురళీ ఫోటో ముందు నిలబడిన చిన్నారులు – "అన్నయ్యలాగే మిలటరీలో చేరతా" అని ప్రతిజ్ఞలు చేస్తున్నారు. కడచూపు కోసం తరలివస్తున్న అధికార, అనధికార, బంధు మిత్రుల కనుకొనకల నుంచి నీరు చెంపల మీదుగా జారుతోంది.

**ప్రతి అడుగులో తల్లిదండ్రుల ఆశ** వాణి డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్‌గా పనిచేసిన మురళీ, ఆటలలోనూ ప్రతిభ చూపించి ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాడు.ప్రిన్సిపల్ వజనమ్మ మాటల్లో చెప్పాలంటే – "ఎప్పుడూ తన లక్ష్యంపైన్నేగురి.. దేశానికి ఏదైనా చేయాలనే తపన ఉండేది. అలాంటి యువకుడు మానవ చరిత్రలో నిలిచిపోవడం ఆవేదనకలిగించే గర్వకారణం."

**తండాలో విగ్రహం..** మురళీ తండ్రి కోరిక మేరకు తండాలోనే విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. అధికార లాంఛనాలతో మురళీ నాయక్ కు అంతిమ వీడ్కోలు పలికిన తర్వాత తండాలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. మురళీ నాయక్ త్యాగాన్ని మాటల్లో వర్ణించలేని విధంగా అక్కడ స్మారక స్థూపాన్ని నిర్మించనున్నారు గ్రామస్తులు.చివరిగా ఓ తల్లికి బిడ్డను కోల్పోయింది. కానీ భారతమాతకు సింధూరం దొరికింది.మురళీ నాయక్ వలె దేశాన్ని ప్రేమించే వారు చాలా తక్కువ. అతని పోరాటం, త్యాగం కేవలం ఓ కుటుంబ కథ కాదు – అది ఒక పల్లె మనిషి గుండె ధైర్యాన్ని చూపించే గాథ. ఆ గౌరవాన్ని జాతీయ జెండాలో చుట్టిన మృతదేహం ఇచ్చింది. తండ్రి చెబుతున్నాడు – "నా కొడుకు ఆఖరి ఊపిరితో మాకో చిన్న గర్వాన్నిమిగిల్చాడు. ఇప్పుడు ఆ గర్వం కన్నీటి తోరణంగా మారింది."మురళీ నాయక్‌కి శతకోటి నమస్సులు – నీ పాదముద్రలు ఈ మట్టిలోనే శాశ్వతంగా నిలిచిపోతాయి. వీర జవాన్ మురళీనాయక్ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాడు. పేదవాడైనా, మారుమూల తండాలో పుట్టినా, దేశానికి సేవ చేయాలన్న తపన ఉంటే ఎంత ఎత్తుకైనా ఎదగొచ్చని చాటిచెప్పాడు. మురళీ నాయక్ మిలటరీ దుస్తుల్లో జీవితం కోల్పోయాడు – కానీ చరిత్రలో జీవంగా నిలిచిపోయాడు.

# అనసూయ.. నడముతో వయ్యారాల సెగ



అనసూయ భరద్వాజ్.. ఎలాంటి డ్రెస్ లో కనిపించినా కూడా తనదైన గ్లామర్ తో సరికొత్తగా కనిపిస్తూ ఉంటుంది. ఇటీవల షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో నాన్ స్టాప్ గా వైరల్ అవుతున్నాయి. పింక్ కలర్, మల్టీ కలర్ లెహంగా–చోళీ ధరించి అనసూయ చేసిన ఈ ఫోటో షూట్ ఫ్యాన్స్‌ని పూర్తిగా ఆకట్టుకుంటోంది. బోల్డ్ అటిట్యూడ్, క్యూట్ ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ అంతా కలసి ఈ ఫోటోలు స్పెషల్ గా నిలుస్తున్నాయి. రంగురంగుల దుస్తులు, పర్ఫెక్ట్ స్టైలింగ్ తో అనసూయ ఈ సారి మరీ అందంగా కనిపిస్తోంది.ఈ ఫోటోల్లో అనసూయ వేసిన మల్టీ కలర్ లెహంగా దుస్తులు అద్భుతంగా ఆకర్షిస్తున్నాయి. పైన వేసిన చోళీ పైన చిన్న చిన్న అద్దాలు, కట్లు వేస్తూ డిజైన్ చేసిన పద్ధతి, చీరని ఎగుర వేసిన ఫోటో పొజ్ అంతా చూసేవారికి ఒక కళాత్మక దృశ్యం లా కనిపిస్తోంది. ఈ లుక్‌లో అనసూయ స్టైల్, కాన్ఫిడెన్స్ రెండూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఫ్యాన్స్ మాత్రం ఈ ఫోటోలు చూసి కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. 'అనసూయ గారూ.. మీరు వెన్నెలకంటే అందంగా ఉన్నారు', 'ఒక్క చూపుతో గుండెల్లో తుఫాను' అంటూ ఫ్యాన్స్ రియాక్షన్లు వెల్లువెత్తుతున్నాయి. అనసూయ ఈ మధ్యకాలంలో తన లుక్‌లతో, ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తో ఎక్కువగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది.అనసూయ కెరీర్ విషయానికి వస్తే, యాంకరింగ్ నుంచి సినిమాల వరకు తనదైన గుర్తింపు తెచ్చుకుంది. 'జబర్దస్త్' షోతో స్టార్ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అనసూయ, ఆ తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' వంటి బిగ్ స్క్రీన్ ప్రాజెక్ట్‌లలో తన నటనతో కితాబు అందుకుంది. పుష్ప సినిమాలోని దాక్షాయిణి పాత్ర అయితే ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. తాజాగా అనసూయ వెబ్ సిరీస్‌లలోనూ బిజీ అవుతోంది. అలాగే అనసూయ మరికొన్ని ప్రాజెక్ట్స్‌లో నటిస్తోంది. అలాగే ఒక నటిగా మాత్రమే కాకుండా యాంకర్, మోడల్, వెబ్ సిరీస్ ఆర్టిస్ట్ ఇలా విభిన్న వేదికల్లో తనదైన ముద్ర వేసుకుంటూ వెళ్తోంది.

# సవాల్ విసిరే పాత్రలకే సై!



బాలీవుడ్ లో అనన్యా పాండే కెరీర్ మూడు పువ్వులు..ఆరు కాయలుగా సాగిపోతుంది. జయాపజయాలను బ్యాలెన్స్ చేస్తూ ముందుకెళ్తుంది. టాలీవుడ్ లో కలిసి రాలేదు కానీ, బాలీవుడ్ లో మాత్రం మంచి కెరీర్ ని బిల్డ్ చేసుకుంటుంది. ఇటీవలే 'కేసరి చాప్టర్ 2'తో మరో సక్సెస్ ఖాతాలో వేసుకుంది. ఇందులో అమ్మడి పాత్రకు మంచి పేరొచ్చింది. నటనకు ఆస్కారం ఉన్న రోల్ కావడంతోనే ఇది సాధ్యమైంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా అనన్యా పాండేలో చాలా మార్పులు తీసుకొచ్చినట్లు ఆమె మాటల్లో కనిపిస్తుంది. కథల విషయంలో ఎలా వ్యవహరించాలి? అన్నది ఈ సినిమా ఓ అవగాహన ఇచ్చిందని తెలిపింది. 'బ్యాడ్ న్యూ'జ్, 'కాల్ మీ బె' లాంటి చిత్రాల్లో ఇప్పటి వరకూ తాను చేసినవి కేవలం కామెడీ పాత్రలని... గ్లామరస్ పాత్రల్లో నటిస్తే కేవలం అనుభూతి మాత్రమే వస్తుందంది. కానీ 'కేసరి' లాంటి సినిమాలో సవాల్ విసిరే పాత్ర చేస్తే అసలైన నటి బయటకు వచ్చిందని అభిప్రాయపడింది. ఇక పై ఎలాంటి పాత్ర తీసుకున్నా? అది సవాల్ గా ఉండాలి తప్ప సునాయాసంగా ఉండకూడదంది. శక్తి వంతమైన పాత్రలు పోషించినప్పుడే ఏ నటిలోనైనా అసలైన నటి బయటకు వస్తుందని తెలిసింది. కెరీర్ కొత్తలో ఇలాంటివి తెలియక తప్పులు జరగడం సహజమైనా? ఇప్పుడున్న పోటీలో అలాంటి తప్పులు ఆరం భంలో కూడా చేయకూడదని అభిప్రాయపడింది. అలా చేస్తే అవకాశాలు రావడం కష్టమంది. మొత్తానికి అనన్యలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో ఎంతో దూకుడుగా వ్యవరించిన అమ్మడు ఇప్పుడా దూకుడు కూడా తగ్గించింది. ప్రొఫెషనల్ కెరీర్ లోనే కాదు...పర్సనల్ కెరీర్ లోనే అనన్య లో చాలా మార్పులొచ్చాయని ఆమె ని దగ్గర నుంచి చూసే స్నేహితులు అభిప్రాయపడుతున్నారు. మార్పు మంచిదే కదా. 'లైగర్' సినిమాతో అనన్యా పాండే టాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే.

# కరువు ప్రాంతాల్లో ఆర్‌డీటీ సేవలపై డైరెక్టర్ ఫెర్రర్ తో చర్చించిన మంత్రి సత్యకుమార్



**అనంత పురం, మే 10 (వార్తాప్రభ ప్రతినిధి)**అనంతపురంలో ఆర్‌డీటీ డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్థిక శాఖా మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ లు కలిశారు. కరువు ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఆర్‌డీటీ అందిస్తున్న సేవల గురించి చర్చించారు.ఆర్‌డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ కోసం కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా కి లెటర్ రాసిట్లు మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాజకీయాలకతీతంగా కరువు ప్రాంతాల్లో పేదలు, మధ్య తరగతి ప్రజల విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, ఇళ్ల నిర్మాణం కోసం ఆర్‌డీటీ అందిస్తున్న మానవీయ సేవలను ఆ లేఖ ద్వారా కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆర్‌డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ, సంస్థను "ప్రైయర్ అప్రూవల్ కేటగిరీ" నుంచి తొలగించాలని కోరిన సంగతినీ మంత్రి సత్యకుమార్ వివరించారు. ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతుల కోసం అవసరమైన పత్రాలు కేంద్రానికి పంపించాలని ఫెర్రర్ ని కోరారు. ప్రజాసంక్షేమానికి ఉపయోగపడే పనులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సత్యకుమార్ చెప్పారు.

# నైరుతి రుతుపవనాలు ఈ సారి మే 27న కేరళను తాకే అవకాశం

**విజయవాడ, మే 10 (వార్తాప్రభ ప్రతినిధి)**నైరుతి రుతుపవనాలు ఈ సారి మే 27న కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇవాళ తెలిపింది. సాధారణంగా ప్రతి ఏడాది జూన్ 1 లేదా ఆ తర్వాత రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి.దీంతో వర్షాకాలం ప్రారంభమైందని భావిస్తాం. నైరుతి రుతుపవనాలు ప్రవేశించాక జులై 8 నాటికి భారత్ వ్యాప్తంగా విస్తరిస్తాయి.అయితే, 2009లో నైరుతి రుతుపవనాలు మే 23నే ప్రవేశించాయి. ఆ తర్వాత చాలా మళ్లీ ఇప్పుడు అంచనాల కంటే చాలా ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయి. అనంతరం సెప్టెంబరు 17న రుతుపవనాల ఉపసంహరణ ప్రారంభమవుతుంది. ఆ తదుపరి నెల 15 నాటికి ఇది ముగుస్తుంది.కాగా, ఈ సారి వర్షపాతం సాధారణం కంటే అధికంగా నమోదు అవుతుందని ఐఎండీ ఏప్రిల్ నెలలోనే తెలిపింది. సాధారణం కంటే తక్కువగా వర్షపాతం కురిసే ఎల్‌నినో పరిస్థితుల లేవని చెప్పింది. భారత్‌లో 52 శాతం నికర సాగు భూమికి వానలే ఆధారం. భారత్‌లోని వ్యవసాయ ఉత్పత్తిలో దీని నుంచి 40 శాతం దిగుబడి వస్తుంది. ఇండియాలో ఆహార భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వానికి నైరుతి రుతు పవనాలది ప్రధాన పాత్ర."నాలుగు నెలల రుతుపవన కాలంలో (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక సగటు 87 సెం.మీ.లో 105 శాతం వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశాము" అని అధికారులు అప్పట్లో ప్రకటించారు.జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా భారతదేశంలో దాదాపు 87 సెం.మీ. వర్షం పడుతుంది. దీనిని దీర్ఘకాలిక సగటు అంటారు. ఈ సంవత్సరం, మాత్రం మొత్తం వర్షపాతం 87 సెం.మీ.లో 105 శాతం ఉంటుందని అంచనా వేశారు. అంటే 91.35 సెం.మీ. వర్షపాతం పడుతుందని అంచనా వేసినట్లు లెక్క.

# ప్రయాణికురాలి బ్యాగ్ ను అప్పగించిన పోలీసులు

**ఏలూరు, మే 10 (వార్తాప్రభ ప్రతినిధి)** రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగును రైల్వే పోలీసులు తిరిగి ఆమెకు అప్పగించారు. విజయవాడకు చెందిన రమాదేవి తిరుపతి వెళ్లి తిరుగు ప్రయాణంలో విజయవాడకు రైల్లో శనివారం ఉదయం వచ్చింది. రైలులో ఆమె బ్యాగును మర్చిపోయింది. వెంటనే విజయవాడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. విజయవాడ పోలీసులు, ఏలూరు రైల్వే పోలీసులను అలర్ట్ చేశారు. ఆ బ్యాగ్ ను ఏలూరు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని తిరిగి రమాదేవికి అప్పగించారు.

# సహనానికి, ఓపికకు హద్దు ఉంటుంది.

**మేడ్చల్, మే 10 (వార్తాప్రభ ప్రతినిధి):** సూరారంలోని మల్లారెడ్డి హెల్త్ సిటీలో దేశ సైనికులకు సంఘీభావంగా నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథి గా హాజరైయారు.హరీష్ రావు మాట్లాడుతూ ఇంత చక్కటి కార్యక్రమం ఏర్పాటుచేసిన మల్లారెడ్డి . , ఇక్కడి ఎమ్మెల్యే వివేక్ గౌడ్ ని నేను అభినందిస్తున్నాను. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు సంఘీభావంగా ఈ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయం. భారత దేశ సైనికులను చూసి గర్వపడుతున్నాం. సరిహద్దులు అంటే భౌగోళికంగానే కాదు ఈ దేశ ప్రజల భద్రత, దేశ భవిష్యత్తు కూడా. దానిని నిలబెట్టడానికి సైనికులు పోరాడుతున్నారు. పాకిస్తాన్ మన దేశం నుండి విడిపోయినప్పటికీ మన దేశాన్ని ఇబ్బంది పెట్టాలని ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నది. ముంబైలో తాజ్ హోటల్ పై పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేశారు. వారు పాకిస్తాన్ పంపిన ఉగ్రవాదులు అని ప్రపంచం ముందు ఆ దేశాన్ని దోషిగా నిలబెట్టింది భారతదేశం. అమెరికా లాంటి దేశాలపై కూడా బిన్ లాడెన్ లాంటి ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి దాడులకు తెగబడ్డారని అన్నారు.సహనానికి, ఓపికకు హద్దు ఉంటుంది. చాలా సంవత్సరాలు ఓపికగా చూసాం. ఇప్పుడు భరించేది లేదు దేశ ప్రజల భద్రతే ముఖ్యం. మతం పేరు అడిగి టూరిస్టులను చంపడం దేశ ప్రజల మనసులను కలచి వేసింది.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మల్లవోలులో తల్లికి వందనం



పెడనమే 10 (వార్తాప్రభ) : పెడన నియోజకవర్గం లోని గూడూరు మండలం మల్లవోలు గ్రామంలో శనివారం నాడు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఓ కె గ్లోరీ రీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రేవతి బాల బాలికల చేత తల్లులకు పాదాభివందనం చేయించారు. పిల్లలను స్కూలుకు పంపించే విషయంలో శ్రద్ధ వహించే తల్లులకు బహుమతులను అందజేశారు. అలాగే పిల్లల చేత మొక్కలను కూడా నాటించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎంఎస్కేలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యువనేత కడియాల గణేష్ ఇంట జరిగిన పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే రాము..

● చిన్నారి కడియాల వర్ణికకు ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే రాము, కూటమి నాయకులు..

ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సందడి వాతావరణంలో జరిగిన పుట్టినరోజు వేడుకలు..



గుడివాడ,మే 10 (వార్తాప్రభ) : టిడిపి నాయకుడు కడియాల గణేష్ కుమార్తె వర్ణికా లక్ష్మీ మొదటి పుట్టినరోజు వేడుకలు గుడివాడ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం ఘనంగా జరిగాయి. వేడుకల్లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మరియు కూటమి పార్టీల నాయకులు పాల్గొని పుట్టినరోజు చిన్నారి వర్ణికకు ఆశీస్సులు అందించారు. భగవంతుని దీవెనలతో చిన్నారి వర్ణికా ఉజ్వల భవిష్యత్తుతో ఎదగాలని ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులు ఆకాంక్షించారు. పెద్ద ఎత్తున కూటమి నాయకులు పాల్గొనడంతో ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సందడి వాతావరణం నెలకొంది. గణేశ సతీమణి సుమ వైద్యురాలు కావడంతో గుడివాడలోని వైద్య ప్రముఖులు వేడుకల్లో పాల్గొని చిన్నారి వర్ణికను ఆశీర్వదించారు. గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, బిజెపి అధ్యక్షుడు ఆర్కే, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, సిపిఎం పార్టీ నాయకులు ఆర్ సి పి రెడ్డి, గుడివాడ నియోజకవర్గ పరిధిలోని టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, అధికార ప్రముఖులు, పలువురు సామాజికవేత్తలు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు వేడుకల్లో పాల్గొని వర్ణికా లక్ష్మీను ఆశీర్వదించారు.

## బుద్ధ పూర్ణిమ వేడుకలను జయప్రదం చేయండి..

-మాజీ కృష్ణాడెల్టా పి.సి. చైర్మన్ గుత్తా చంటి



గుడివాడ,మే 10 (వార్తాప్రభ) : సోమవారం బుద్ధ పూర్ణిమ సందర్భంగా బంటుమిల్లి రోడ్డు -పాత బైపాస్ రోడ్ లో గల బౌద్ధ స్తూపం వద్ద బుద్ధ పూర్ణిమ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు తెలిపారు. ఇందులో ముఖ్యంగా నెహ్రూ చౌక్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి బౌద్ధ స్తూపం దగ్గర జ్ఞానం చేయబడునని పేర్కొన్నారు. కావున అన్ని పార్టీల రాజకీయ నాయకులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, ప్రముఖ యూనియన్లు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో నిర్వాహకులు ఎక్స్ పి.సి. చైర్మన్ గుత్తా శివరామకృష్ణ (చంటి), పొంగులేటి జయరాజ్ అంబేద్కర్ భవన్ అధ్యక్షులు, పిరమిడ్ కేంద్రం రాజ కుమారి, మానవతా సంస్థ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, దారం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేత జబీన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

● పెద్ద సంఖ్యలో పాల్గొని పరీక్షలు చేయించుకున్న 11వ వార్డు ప్రజలు..





గుడివాడ,మే 10 (వార్తాప్రభ) : స్థానిక 11 వార్డ్ -వలివర్తిపాడు రోడ్డులో వార్డు ఇంచార్జ్ సయ్యద్ జబీన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొని చికిత్సలు చేయించుకున్నారు. టిడిపి నాయకుడు సయ్యద్ హన్ను స్వగృహంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్ నిపుణులు కంప్యూటర్ సహకారంతో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని టిడిపి నాయకుడు సయ్యద్ జబీన్ మరియు, పార్టీ నాయకులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జబీన్ మీడియాతో మాట్లాడుతూ నేడు శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేస్తామని తెలిపారు. అనేకమందికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్ఫూర్తితో తన శక్తి మేరకు పదిమందికి మంచి చేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా జబీన్ అన్నారు. అలాగే రానున్న రోజుల్లో 11వ వార్డు ప్రజల శ్రేయస్సుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సయ్యద్ హన్ను, షేక్ కరీముల్లా, పట్టపు చిన్నా, రబ్బానీ, కరిముల్ల, అబ్దుల్ షరీఫ్, మల్లికా బేగం, సయ్యద్ మోబీన్, ఛాను, రుహుల్ల, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## త్వరలో మన దేశదెబ్బకి పాకిస్థాన్ కుదిలైపోవడం ఖాయం..

-బిజెపి మచిలీపట్నం పార్లమెంటు కన్వీనర్ సూరే గాంధీ



గుడివాడ,మే 10 (వార్తాప్రభ) : మన దేశ రక్షణ కోసం అనునిత్యం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మన కోసం పనిచేస్తున్నటువంటి మన సైనికుల న్యాయపద్ధ పోరాటానికి ముక్కోటి దేవతలు ఆశీర్వదించాలని బిజెపి మచిలీపట్నం పార్లమెంటు కన్వీనర్ సూరే లక్ష్మీనారాయణ (గాంధీ) ఆకాంక్షించారు. స్థానిక శ్రీనివాస్ సెంటర్లో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఆరాధన ఉత్సవాల్లో పాల్గొని విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూరే గాంధీ మాట్లాడుతూ మతాలకతీతంగా ప్రతి ఒక్క భారతీయుడు ఈ సమయంలో మన దేశ ప్రభుత్వానికి అండగా ఉండాలని మనకోసం మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏ నిర్ణయం తీసుకున్న దానికి అందరి ఆశీస్సులు ఉండాలని కోరారు. అతి త్వరలోనే మన దేశ దెబ్బకి పాకిస్తాన్ కుదిలైపోవడం ఖాయమని అన్నారు. అసెంబ్లీ కన్వీనర్ శ్రీ దావులూరు సురేంద్రబాబు మాట్లాడుతూ సరిహద్దులో మనకోసం ఎండ వాన లెక్కచేయకుండా మన కోసం పోరాడుతున్న మన సైనికులకు దేవి దేవతల ఆశీస్సులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ పెంటపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాకులేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం..



ఘంటసాల : అవనిగడ్డ,మే 10 (వార్తాప్రభ) : ఘంటసాల మండలంలోని శ్రీకాకుళంలో వేంచేసియున్న శ్రీ ఆంధ్ర మహావిష్ణు శ్రీ కాకులేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు గారు స్వామి వార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కళ్యాణ బ్రహ్మోత్సవాలలో మొదటి రోజైన శనివారం పట్టు వస్త్రాలను శ్రీ స్వామి వార్లకు ఆలయ అర్చకులు అగ్నిహోత్రం భాస్కరాచార్యులకు శ్రీరామ వరప్రసాదరావు అందజేశారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11వ తేదీ ఆదివారం రాత్రి శ్రీ స్వామి వారి కళ్యాణం, 12వ తేదీ రాత్రి 7 గంటలకు శ్రీ స్వామివారి రథోత్సవం, 13వ తేదీ మంగళవారం అశ్వ వాహనంపై ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ గారి సూచనల మేరకు 14వ తేదీ బుధవారం శ్రీ కృష్ణదేవరాయల మహోత్సవ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమాలలో తోట చెన్నకేశవులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లికి వందనం కార్యక్రమం..





గుడివాడ,మే 10 (వార్తాప్రభ) : శనివారం గుడివాడ ప్రాజెక్ట్ అర్బన్ ఏరియాలో 2వ సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో మరియు రూరల్ లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లికి వందనం (ప్రీ మదర్స్ డే) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పిల్లల చేత తల్లులకు కాళ్ళు కడిగించి పాదాభివందనం చేయించారు. ఈ సందర్భంగా మదర్స్ డే తల్లి యొక్క అపారమైన ప్రేమ, త్యాగం మరియు మాతృత్వానికి గుర్తింపునిస్తుందని, ఈ రోజున పిల్లలు తమ తల్లుల పట్ల తమ ప్రేమ మరియు కృతజ్ఞతను తెలియజేసారు. ముఖ్యంగా తల్లి అనేది ఒక కుటుంబం యొక్క మూలస్తంభం మరియు సమాజానికి ఒక ముఖ్యమైన భాగం అని కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఎన్ జ్యోతి, సుభాషిణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన బ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనోత్సవాలు

● శాంతి నిమిత్తం శ్రీనివాస్ సెంటర్‌లో భారీ అన్నసమారాధన..



గుడివాడ,మే 10 (వార్తాప్రభ) : శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామివారి 54వ ఆరాధనోత్సవాలు అత్యంత వైభవముగా జరిగిన సందర్భంగా శాంతి నిమిత్తం శనివారం స్థానిక శ్రీనివాస్ సెంటర్‌లో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘపెద్దలు పాలూరి సూరిబాబు, పులవర్తి ఆనంద్, పెద్దపాటి రవికుమార్, యుండురి ప్రసాద్, కోట నూకరాజు, మందరపు బ్రహ్మాజి, డి. నగేష్, టేకి రాజగోపాలచారి, వంజరపు వేంకటేశ్వరరావు, టేకి వీరాచారి, గొలిత నారాయణ, గుడివాడ సత్యనారాయణ, చింతలూరి సత్యనారాయణ, అనుఘోజు వినయ్, వేముల భార్గవ్, టి. హరి, వేముల శ్రీను, తమిరి సురేష్, గుడాల నాని ఇతర సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## అమరవీరుడు మురళి నాయక్ కు ఘన నివాళులు



విస్సన్నపేట,మే 10 (వార్తాప్రభ) : స్థానిక మండలంలోని మారెమండ గ్రామపంచాయతీ పరిధిలో గిరిజన తండాల తో పాటు మారెమండ గ్రామంలో కూడా గ్రామ సర్పంచ్ నందమూరి శ్రీరామచంద్ర ఆధ్వర్యంలో భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన కుటుంబాలు నివాళులు అర్పించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ భారతదేశ రక్షణలో భాగంగా పాకిస్తాన్ ముష్కరులతో యుద్ధం చేసే వీర స్వర్గం అలంకరించిన మురళి నాయక్ సేవలు మరువలేనివి మరపురానివి మహోన్నతమైనవని ఆయన చెప్పారు.

## సమగ్ర ప్రాంతీయ అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం - వడ్డే శోభనాద్రీశ్వరరావు




గుంటూరు,మే 10 (వార్తాప్రభ) : 26 జిల్లాల సమగ్రాభివృద్ధి తోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమౌతుందని, రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, గత మూడు దశాబ్దాలుగా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తిచేయాలని ప్రముఖ రాజ నీతిజ్ఞులు, మాజీ మంత్రివర్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీ శనివారం గుంటూరులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి పై జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షతన జన చైతన్య వేదిక హాలులో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయడానికి అధికార పార్టీలు, ప్రధాన ప్రతిపక్షం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే స్థితిలో లేవన్నారు. నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా 80 వేల కోట్లతో పోలవరం - బనకచర్ల భారీ ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెరపైకి తీసుకొని వస్తున్నారని, ఇది ఆంధ్రప్రదేశ్ కు గుదిబండగా మారనుందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది బలిదానాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారానికి అవసరమైన బొగ్గు గనులను కేటాయించక పోవడం వలన నష్టాలకు గురి అవుతుంటే, మరోవైపు ప్రైవేటు రంగంలో ఆర్సేలర్ మిట్టల్ కు ఎర్ర తివాచి పరచి స్టీల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చి, బొగ్గు గనులు కేటాయించడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రాజధాని పేరుతో 58వేల ఎకరాలు సేకరించి, నేడు మరో 44 వేల ఎకరాల సాగు భూములను రైతుల నుండి తీసుకొని ప్రపంచంలోనే 5వ అతిపెద్ద రాజధానిగా నిర్మించాలని పగటి కలలు కంటుందని, దీనికోసం కనీసం లక్ష కోట్లు అప్పులు చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. సాక్షాత్తు దేశ రాజధాని ఢిల్లీకి 83కి.మీ చెన్నై, బెంగళూరు లకు 62 కి.మీ మేర ఓటర్ రింగ్ రోడ్ లు ఉండగా, కేవలం లక్ష జనాభా మాత్రమే ఉన్న అమరావతికి 197 కి. మీ అవుటర్ రింగ్ రోడ్ నిర్మించ తలపెట్టడం ప్రజాధనాన్ని వృధా చేయడమేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన నిర్ణయాలు సంబంధిత మేధావులు, నిపుణులతో సంప్రదించకుండానే ఏక పక్షంగా చేస్తుందని, మూగ ప్రజలు, చెవిటి ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని విజయవంతం చేయలేవన్నారు. చైతన్య, నారాయణ, భాష్యం లాంటి కార్పొరేట్ విద్యా సంస్థల్లో 10శాతం మేర ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించాలని కోరారు. మహారాష్ట్రల్లో 167, ఉత్తర ప్రదేశ్ లో 116, కర్ణాటకలో 75 షుగర్ ఫ్యాక్టరీలు ఉండగా మన రాష్ట్రంలో కేవలం 5 మాత్రమే ఉండడం చేదు వాస్తవమన్నారు. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ గత ప్రభుత్వంలో వేలాది కోట్ల రూపాయలు అవినీతి చేసిందని బహిరంగంగా మాట్లాడి, హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసిన నేటి పాలకులు మరలా షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ చేతిలో విద్యుత్ రంగాన్ని పెట్టడం దారుణమన్నారు. గతంలో 8 వేలు విలువచేసే స్మార్ట్ మీటర్లను 36 వేలకు కేటాయించడం, ట్రాన్స్ఫార్మర్లను కూడా రెట్టింపు ధరలకు ఇచ్చి జగన్ ప్రభుత్వం దోపిడీ చేస్తే నేడు కూటమి ప్రభుత్వం అదే త్రోవలో పయనిస్తుందని అవహేళన చేశారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ దక్షిణ భారతదేశంలో అతి తక్కువ తలసరి ఆదాయం కలిగి,అక్షరాస్యతలో 32వ స్థానంలో ఉండి, ప్రతి నెలా 6వేల కోట్ల రూపాయల వడ్డీలు చెల్లిస్తూ ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేటి ప్రభుత్వం వాస్తవాలకు దూరంగా గత 11 నెలల్లో మరో లక్ష 50 వేల కోట్లు అప్పులు చేసి అనుత్పాదక రంగాలకు ఖర్చు చేయడం అవివేకమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతికి వ్యవసాయరంగ ప్రాధాన్యతే ముఖ్యమని, జల వనరులను సద్వినియోగం చేసుకొని, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తే వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగి, సంపద, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. పాలకులు నీటిపారుదల ప్రాజెక్టులను అవినీతి పారుదల ప్రాజెక్టులుగా మార్చినారన్నారు. ఫీజు రీయబర్స్మెంట్ అమలు చేయలేకపోవడం వలన వేలాది పేద విద్యార్థులు నష్టపోతున్నారని, ఆరోగ్య శ్రీ నిధులు సంబంధిత ఆసుపత్రులకు సకాలంలో చెల్లించకపోవడం వలన పేద రోగులు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో వందలాది కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి వేడుకలను, బహిరంగ సభలను నిర్వహించడం బాధ్యతా రాహిత్య మన్నారు. అమరావతిలో రాజధాని పేరుతో కి.మీ. రోడ్డుకు 64 కోట్ల రూపాయలు, ఒక చదరపు అడుగుకు పదివేల రూపాయలకు పైగా వెచ్చిస్తూ అనుయాయులకు లబ్ది చేకూరుస్తున్నారని విమర్శించారు. ప్రముఖ విద్యావేత్త ప్రొ.డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన నియోజక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోగలమని, నియోజక వర్గ, జిల్లాస్థాయిల్లో ప్రణాళిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొ. ఎన్. వేణుగోపాలరావు ప్రసంగిస్తూ ప్రజలను జాగృతలను చేస్తేనే ప్రభుత్వాలు సక్రమంగా నడుస్తాయని, నది పరీవాహక ప్రాంతాలలో వ్యవసాయేతర కార్యక్రమాలు ఉండరాదని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం. ఎస్. స్వామినాథన్ సూచనను రాష్ట్ర ప్రభుత్వాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ పావులూరి రమేష్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, రాజ్యాంగ చర్చావేదిక కన్వీనర్ అవధానుల హరి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలో తల్లికి వందనం కార్యక్రమం...



కృత్తి వెన్ను ,మే 10 (వార్తాప్రభ) : కృత్తివెన్ను మండలంలోని ప్రతి అంగన్వాడి కేంద్రాలలో అడ్వాన్స్ మదర్స్ డే సెలబ్రేషన్స్ బంటుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ సముద్ర వేణి ఆదేశాల మేరకు ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్యామల గౌరీ ఆధ్వర్యంలో తల్లికి వందనం అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు వారి తల్లుల కాళ్లు కడిగి తల్లి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.అమ్మ బొమ్మకు రంగులు దిద్ది అమ్మకు గిఫ్టుగా ఇవ్వడం జరిగింది. లోకల్ గా దొరికే పువ్వులతో పిల్లలు బొకే తయారు చేసి వారి తల్లికి వెల్కమ్ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తల్లులు చాలా సంతోషించడం జరిగింది.అన్ని అంగన్వాడీ సెంటర్లలో అడ్వాన్స్ గా మదర్స్ డే సెలబ్రేషన్స్ చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది అంగన్వాడి టీచర్స్ ఈ కార్యక్రమం నిర్వహించడం వారి అదృష్టంగా భావిస్తున్నారు.

## నేడు కవులూరు లో ఉచిత వైద్య శిబిరం

జి.కొండూరు,మే 10 (వార్తాప్రభ) : ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ జువ్వా వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు.ఈ శిబిరంలో షుగర్, బి పి ఇతర సాధారణ వ్యాధు లకు సంబంధించి వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందని జెవిఆర్ వెల్లడించారు.వ్యాధి నిర్ధారణ గ్రస్తులకు ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా మందులు అందజేయనున్న ట్లు ఆయన తెలిపారు.ఈ అవకాశాన్ని కవులూరు, పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల ని జువ్వా వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# క్యాన్సర్ పై పోరాటంలో మరో ముందడుగు..

## సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్

● క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడం.. వ్యాధిగ్రస్తులకు అండగా నిలిచే లక్ష్యాలతో సంస్థ ఆవిర్భావం ● ఆరోగ్య భారత ఆవిష్కరణలో స్వచ్ఛంద సంస్థలు కీలక భూమిక పోషించాలి ● క్యాన్సర్ రహిత సమాజం కోసం సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ ఏర్పాటు ● టెలికాం రంగ దిగ్గజం ప్రొఫెసర్ ఎన్.కె. గోయల్





**విజయవాడ,మే 10 (వార్తాప్రభ) :** క్యాన్సర్ వ్యాధిపై పోరాటం మరో ముందడుగు పడింది. ఎంతో మందిని కబళిస్తున్న క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వ్యాధి నిర్ధారణ పరీ క్షలు, సమగ్ర చికిత్సలను ప్రజలందరికీ చేరువ చేయడం, ఆర్థికంగా వెనుకబడిన పేషెంట్లకు చేయూతనందించడం.. ఇలా, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అడుగడుగునా అండగా నిలబడటం కోసం సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ అనే స్వచ్ఛంద సేవా సంస్థకు అంకురార్పణ జరిగింది. నగరంలోని హెూటల్ ఫార్చ్యూన్ మురళీ పార్క్ నందు శనివారం జరిగిన కార్యక్రమంలో సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ ను లాంఛనంగా ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టెలికాం రంగ దిగ్గజం, సీఎంఏఐ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎన్.కె.గోయల్ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, ఆరోగ్య భారత ఆవిష్కరణలో స్వచ్ఛంద సంస్థలు కీలక భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. క్యాన్సర్ వ్యాధిని జయించేందుకు సిటిజెన్ ఫోర్స్ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతునిస్తామని తెలియజేశారు. సిటిజెన్ ఫోర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ పిన్నంశెట్టి రమేష్ బాబు మాట్లాడుతూ, క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం కోసం సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ పనిచేస్తుందని అన్నారు. ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా చైతన్యవంతం చేయడం, వ్యాధిగ్రస్తులకు సకాలంలో సమగ్ర చికిత్సలందేలా చూడటం, చికిత్సానంతరం సాధారణ జీవనం సాగించేలా అండగా నిలబడడం.. సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ లక్ష్యాలని వెల్లడించారు. సాధారణంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో మానసిక స్థైర్యం దెబ్బతింటుందని.. వారికి తోడుగా నిలబడి మనో ధైర్యం నింపితే క్యాన్సర్ ను సులువుగా జయిస్తారని అన్నారు. సిటిజెన్ ఫోర్స్ వేదిక ద్వారా క్యాన్సర్ రోగులకు సామూహిక సహకారం అందుతుందని, మెరుగైన వైద్యంతో పాటు ఆర్థిక చేయూత లభిస్తుందని వివరించారు. అందరి కోసం ఒక్కరు.. ఒక్కరి కోసం అందరూ.. అనే నినాదంతో ప్రజా భాగస్వామ్యంతో సిటిజెన్ ఫోర్స్ పనిచేస్తుందని చెప్పారు. సిటిజెన్ ఫోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య విజ్ఞాన సంస్థ, అత్యాధునిక కేన్సర్ హాస్పిటల్ రూపుదిద్దుకుంటున్నాయని ఈ సందర్భంగా రమేష్ బాబు తెలియజేశారు. సిటిజెన్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థలు పూర్తి సేవాభావంతో ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో భాగస్వాములవుతానని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్. సుబ్బారావు మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధి బారినపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోందని, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోవడం కారణంగా వారిలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం ఈ పరిస్థితికి ఓ కారణమని ఆయన విశ్లేషించారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అందుబాటులో ఉన్న చికిత్సల గురించి ప్రజలకు తెలియజెప్పడంతో పాటు.. క్యాన్సర్ వ్యాధిని జయించేందుకు అవసరమైన తోడ్పాటును అందించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఆపన్నహస్తం అందించే విధంగా సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ నిలుస్తుందని తెలిపారు. ప్రఖ్యాత రేడియాలజిస్ట్ డాక్టర్ వేమూరి వరప్రసాద్ మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స ప్రభావవంతంగా ఉంటుందని అన్నారు. అందుబాటులో ఉన్న అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా క్యాన్సర్ విముక్త భారత నిర్మాణానికి సిటిజెన్ ఫోర్స్ కృషి చేస్తుందని విశ్వాసం వెలిబుచ్చారు. అనంతరం, ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.వి. మోహన్ ప్రసాద్ మాట్లాడుతూ, క్యాన్సర్ రోగులకు బాసటగా నిలిచేందుకు ఆవిర్భవించిన సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్.. క్యాన్సర్ వ్యాధిపై పోరాటంలో నూతన శకాన్ని ఆవిష్కరిస్తుందని అన్నారు. ప్రముఖ సినీ నటి, సమాజ సేవకురాలు చంద్రానీ దాస్ మాట్లాడుతూ, సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ స్వచ్ఛంద సేవల్లో భాగస్వామి కావడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు.

# విజయవాడ ప్రెస్ క్లబ్ ను అందరి ప్రెస్ క్లబ్ గా మారుస్తాం

● ఎపియుడబ్ల్యూ జే ఆక్రమణ నుండి ప్రెస్ క్లబ్ ను విడిపిస్తాం ● ప్రెస్ క్లబ్ ఆక్రమణదారులలో మార్పు వస్తుందని ఆశించాము. ● ఇక త్వరలో ఉద్యమ రూపంలోకి.. ● విజయవాడ ప్రెస్ క్లబ్ సాధన సమితి



**విజయవాడ,మే 10 (వార్తాప్రభ) :** వాస్తవాలు గ్రహించి విజయవాడ ప్రెస్ క్లబ్ ను ఎపియుడబ్ల్యూజే విడిచి పోవాలని విజయవాడ ప్రెస్ క్లబ్ సాధన సమితి డిమాండ్ చేసింది.శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్ సాధన సమితి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్ ను ఎపియుడబ్ల్యూజే ఆక్రమణ నుండి విడిపించి, అధికారులు కనుసన్నలలో విజయవాడలో ఉన్న జర్నలిస్టుల అందరి మెంబర్షిప్ తో, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎలక్షన్ జరిపి జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషిచేయాలని ప్రెస్ క్లబ్ సాధన సమితి నిర్ణయం తీసుకుంది.ప్రెస్ క్లబ్ ను 1971 లో నిర్మిస్తే 1972 లో ఏర్పడిన ఎపియుడబ్ల్యూజే తమదని చెప్పడం విడ్డూరమని సమితి నాయకులు అన్నారు.వారి స్వార్ధ పూరిత విధానలతో జర్నలిస్ట్ లకు ప్రెస్ క్లబ్ ద్వారా అందవలసిన ఫలాలు అందకుండ పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రెస్ క్లబ్ ను కమర్షియల్ గా మార్చేసి సామన్యులకు అందుబాటులో లేకుండా చేసి, వచ్చే నిధులకు విజయవాడ జర్నలిస్టుల సంక్షేమం కోసం కాక తమ సంఘ కార్యక్రమాల కోసం వినియోగించుకుంటూ విజయవాడ జర్నలిస్టులను మోసం చేస్తున్నారని వారు అన్నారు.కనీసం నీటి పన్నులు, హౌస్ టాక్స్, ఇరిగేషన్ లీజు లు కట్టకుండా అటు ప్రభుత్వాన్ని, ఇటు జర్నలిస్టులను బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించి మోసం చేశారని ఆరోపించారు.విజయవాడ ప్రెస్ క్లబ్ ను అందరి ప్రెస్ క్లబ్ గా మార్చి, విజయవాడ జర్నలిస్టులు అందరికీ మెంబర్షిప్ తో పాటు, ఎలక్షన్స్ జరిపించాడనికి అవసరమైన చర్యలు అధికారులు తీసుకునే విధంగా వాస్తవాలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సమితి తీర్మానించింది. ప్రెస్ క్లబ్ విజయవాడలో ఉన్న ప్రతి పాత్రికేయుడికి చెందుతుందని, అది సాధించేందుకు చాలా సహనంగా ఓపిగ్గా ఉన్నామని అయితే ఏపీయూడబ్ల్యూజే నేతలలో పరివర్తన రాకపోవడంతో ఈ కార్యక్రమాన్ని ఉద్యమ రూపంలోకి తీసుకెళ్లక తప్పట్లేదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్,ఆంధ్రప్రదేశ్ పత్రిక సంపాదకుల సంఘం అధ్యక్షులు కే ప్రసాద్ బాబు,జర్నలిస్ట్ మిత్రుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎ.వి.వి.శ్రీనివాసరావు,ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాకమాను వెంకట వేణు, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నగర అధ్యక్షులు తాళ్లూరి అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి "అంతరాత్మ" శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగోతి శ్రీనివాసరావు, టి బాలాజీ, పి వెంకట్ , చారి నగర నాయకులు ఆర్ కోటేశ్వరరావు, సి పవేంద్ర, బి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్వీయూలో నల్లాని రాజేశ్వరికి ఘనసత్కారం





**అనంతపురము/ తిరుపతి ,మే 10 (వార్తాప్రభ) :** ప్రముఖ విద్యావేత్త, సామాజికవేత్త, కాలమిస్ట్ నల్లాని రాజేశ్వరికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఘన సత్కారం జరిగింది. ప్రజా కళావేదిక, ఎస్వీయూ విద్యార్థుల సంక్షేమం, సాంస్కృతిక వ్యవహారాల డైరెక్టరేట్ సంయుక్త ఆధ్వర్యంలో "మన పల్లె జానపదం జాతర" కార్యక్రమం సేనేట్ హాల్లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన నల్లాని రాజేశ్వరి తనదైన శైలిలో ప్రసంగించి ఆకట్టుకున్నారు. తొలుత విసి ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. భూపతి నాయుడు, ప్రముఖ రచయిత డాక్టర్ వి.ఆర్ రాసాని, ప్రముఖ సామాజికవేత్త, కాలమిస్ట్, కేంద్ర ప్రభుత్వ 'రాజ్యమహిళా సమ్మాన్' అవార్డు గ్రహీత నల్లాని రాజేశ్వరి, ప్రజా కళావేదిక చైర్మన్ అరవ జయపాల్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అరవ జయపాల్ అధ్యక్షత వహించగా విసి అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాతపూర్వక రూపం లేని జానపద సాహిత్యం, మౌఖికంగా ఒక తరం నుండి మరో తరానికి అందిందన్నారు. ఒక సమాజం యొక్క సంస్కృతి, ఆచారాలు, నమ్మకాలు, విలువలను ప్రతిబింబిస్తుందన్నారు. ప్రజల జీవన అనుభవాలు, కష్టాలు, ఆనందాలు, వారి రోజువారీ జీవితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. సమకాలీనమైన విషయాలను, ప్రజల ఆలోచనలు, భావనలు, సంఘటనలను కూడా ప్రతిబింబిస్తుందన్నారు. ప్రత్యేక అతిథి ప్రముఖ కాలమిస్ట్ నల్లాని రాజేశ్వరి మాట్లాడుతూ, మౌఖిక సంప్రదాయాలను కాపాడటానికి, భవిష్యత్తు తరాలకు అందించడానికి ప్రజా కళావేదిక కృషి సహాయపడుతుందన్నారు. జానపద గేయాలు, నృత్యాలు, ఇతర కళా రూపాలు భాగమే నన్నారు. సమకాలీనమైన విషయాలను, ప్రజల ఆలోచనలు, భావనలు, సంఘటనలను కూడా ప్రతిబింబిస్తుందన్నారు. జానపద సాహిత్యం స్థానిక భాష, యాసలో ఉంటుందని,ఇది ఆ ప్రాంతం యొక్క ప్రత్యేకతను తెలియజేస్తుందని వివరించారు. తొలి రోజు దాదాపు 100 మంది కళాకారులు తమ గళాలను వినిపించారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయకులు తమదైన శైలిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ యూనివర్సిటీ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మిణి, తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆదిశేషయ్య, ప్రముఖ కవి సురేంద్ర రొడ్డ, ఏపీ గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ సీనియర్ లైబ్రేరియన్ డాక్టర్ కె నటరాజ నాయుడు, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి ఛాప్టర్ అధ్యక్షులు డా. జి.ఎస్. ప్రసాద్, ప్రముఖ కవయిత్రి రుయా ఆసుపత్రి సర్జన్ డాక్టర్ రోజా రమణి, ప్రజా కళావేదిక ప్రతినిధులు రావిళ్ళ రజని, బెజవాడ నాగమణి, సీనియర్ జానపద కళాకారులు సోము ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

# రెయిన్బో చిల్డ్రన్ హెూంలో దాసరి శేఖర్ పుట్టినరోజు వేడుకలు దుప్పట్లు,పండ్లు, అన్న వితరణ



**కాకినాడ,మే 10 (వార్తాప్రభ) :** బెహరాన్ లో నివసిస్తున్న దాసరి శేఖర్ పుట్టినరోజు సందర్భంగా రెయిన్బో చిల్డ్రన్స్ హెూమ్ లో చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేసి అనంతరం రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు.అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పాస్టు డిస్టిక్ గవర్నర్, క్యాబినెట్ ట్రెజరర్ అలై వనుం శ్రీనివాస్ పేర్కొన్నారు.విదేశాలలో ఉంటూ కూడా తను పుట్టి పెరిగిన ఊరిని మర్చిపోకుండా,తన పుట్టినరోజు సందర్భంగా అనాథలకు అండగా నిలవాలనే గొప్ప సంకల్పంతో ఇంతటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.తన చిన్ననాటి మిత్రుడు దాసరి శేఖర్ పుట్టినరోజును ఇలాంటి చిన్నారుల మధ్య జరుపుకోవడం చాలా గొప్ప విషయమని వారి స్నేహితుడు చిరంజీవి అన్నారు. ఇలాంటి మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ మరి ఎంతో మందికి ఆసరాగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు చేయాలని చిరంజీవి కోరారు.ఈ కార్యక్రమంలో ఇమ్మిడేట్ ఫాస్టు డిస్టిక్ గవర్నర్, దక్షిణాది రాష్ట్రాల కోశాధికారి అలై వనుం శ్రీనివాసరావు,డిస్టిక్ క్యాబినెట్ ట్రెజరర్ కిరణ్ కుమార్,గవర్నర్ ఏరియా రిప్రజెంటేటివ్ లక్ష్మి నాగేంద్ర,పద్మా రామ్ క్లబ్ ప్రెసిడెంట్ భద్రం,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక పిల్లల వైద్యం ఇప్పుడు విస్సన్నపేటలో




**విస్సన్నపేట,మే 10 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ఏ కొండూరు రోడ్డులో గోళ్ళ మనోజ్ కుమార్ (ఎండి ప్రిడియాటిక్స్) చిన్న పిల్లలకు తరంగ పిల్లల హాస్పిటల్ ద్వారా అత్యాధునిక వైద్యాన్ని అందిస్తున్నట్లు సమావేశంలో తెలియజేశారు. అన్ని రకాల మందులు డిస్కౌంట్ తో హెూమ్ డెలివరీ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు

# యుద్ధంలో విజయాన్ని కాంక్షిస్తూ బిజెపి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు.....



**కృత్తివెన్ను,మే 10 (వార్తాప్రభ) :** యుద్ధ వాతావరణం నెలకొన్న పరిస్థితుల్లో భారతీయ సైన్యం త్రివిధ దళాలు క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా ముందుకు సాగాలని వారికి ఆ భగవంతుని రక్షణ ఉండాలని ఆశీస్సులు కలగచేయాలని బంటుమిల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు జల్లూరి కిరణ్ గుప్తా ఆధ్వర్యంలో బంటుమిల్లిలోని పోలీస్ స్టేషన్ వద్ద గల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, పెడన నియోజక వర్గ బీజేపీ పార్టీ కో కన్వీనర్ మాగంటి గంగరాజు గారు సీనియర్ నాయకులు బండి రెడ్డి నాగ రామాంజనేయులు గారు, మురాల వెంకటేశ్వర రావు గారు, ఇల్లూరి నాగబాబు గారు, చిట్టిమోతు నాగేశ్వరరావు గౌడ్, ఏకుల మహేష్ బాబు, మద్ది బాలు దాసరి రమేష్ గారు మరియు పార్టీ కార్యకర్తలు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.. నాయకులు మాట్లాడుతూ భారత జవాన్లు పాకిస్తాన్ కవ్వింపు చర్యలను సమర్ధవంతంగా తిప్పి కొడుతున్నారు, వారిని సమర్థవంతంగా ఎదుర్కొని భారతదేశం యొక్క ఆర్మీ సత్తాను ఆపరేషన్ సిందూర్ ద్వారా తెలియజేస్తున్నారు ఇలాగే భారతదేశపు రక్షణలో ఆర్మీ యొక్క పాత్ర మరువలేనిది అని తెలిపారు.. దేశం వెలుపల రక్షణ ఆర్మీ అని, దేశానికి లోపల రక్షణ బిజెపి పార్టీని అని నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో దేశం ఏ విషయంలోనైనా సరే ముందుకు వెళ్తుందని కొనియాడారు...

# ఈ నెల 12న తిరువూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● తిరువూరు డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టరేట్‌లోనూ అర్జీలు సమర్పించేందుకు ఏర్పాట్లు

● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, మే 10 (వార్తాప్రభ) :** ఈ నెల 12వ తేదీ సోమవారం తిరువూరు డివిజన్ లోని మండలాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం తిరువూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) జిల్లా స్థాయి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఓ ప్రకటన లో తెలిపారు. అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని తిరువూరు డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని విజయవాడలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాస్థాయిలో గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతోందని.. అయితే ఈసారి తిరువూరు డివిజన్ ప్రజల సౌకర్యార్థం తమకు సమీపంలోనే ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరువూరు బస్టాండ్ వెనుక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఉదయం 10 గంటల నుండి అర్జీల స్వీకరణ ప్రారంభమవుతుందన్నారు. తిరువూరు డివిజన్ తో పాటు మిగిలిన ప్రాంతాల ప్రజలు కూడా తిరువూరులో అర్జీలు సమర్పించవచ్చని.. విజయవాడలోని జిల్లా కలెక్టరేట్‌లో కూడా అర్జీలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎప్పటి మాదిరిగానే డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.

# వీర జవాన్ మురళి నాయక్ కి జోహార్లు





**విజయవాడ ,మే 10 (వార్తాప్రభ) :** విజయవాడ నగరంలో కృష్ణలంకలో చలసాని భవన్ వద్ద వీర జవాన్ మురళి నాయక్ మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ సిపిఐ జోహార్ల అర్పించింది. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, మురళి నాయక్ వీర మరణానికి జోహార్లు అర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన జరిపారు. తర్వాత జరిగిన సభకు సిపిఐ నగర నాయకులు మందలపు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు ఈ సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పేకలించాలని, ఆ వైపుగా భారతదేశం అడుగులు వేసిందని, మూడు రోజుల్లో పాకిస్తాన్ పాదాక్రాంతం అయిందన్నారు. ప్రపంచ దేశాల వద్ద రాజీ చేయమని అర్థిస్తూ ప్రాధేయపడే పరిస్థితికి పాకిస్తాన్ వచ్చిందని. దీనివల్ల భారత సైనికుల పోరాట పటిమ తేటతెల్లమైందని దోనేపూడి శంకర్ అన్నారు. తాను చనిపోతూ ఐదుగురు శత్రు సైనికులను చంపి అమరుడైన మురళి నాయక్ కు జోహార్లు అర్పించాలని భవిష్యత్తు తరాలు మురళి నాయక్ త్యాగాన్ని మరువలేవని అన్నారు. భవిష్యత్తులో ఉగ్రవాదాన్ని అణిచివేయటానికి భారత ప్రభుత్వం సర్వసన్నద్ధం కావాలని ఆపరేషన్ సింధూర్, విజయవంతం కావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఇదే సందర్భంలో యుద్ధంలో అమరులైన పౌరులకు వీర జవానులకు శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు ప్రసంగిస్తూ యుద్ధభూమిలో అసువులు బాసిన మురళి నాయక్ కు జోహార్లు అర్పించారు. భారతదేశాన్ని ఏ దేశం కూడా తక్కువగా చూసే పరిస్థితి ఈ రోజున లేదని మన సైనిక శక్తి ఏమిటో ప్రపంచానికి తేటతెల్లమైందని అన్నారు. యుద్ధంలో మరణించిన మురళి నాయక్ కి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కాగితాల రాజశేఖర్, ఎస్. ఆర్. ఆర్ %ఇ% సి.వి. ఆర్ ప్రభుత్వ కళాశాల పూర్వపు విద్యార్థి సంఘ నాయకులు లంక జానయ్య, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి ఈమని దాము, నగర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు బుట్టిరాయప్ప, తాడి పైడయ్య, కొట్టు రమణారావు, మూలి సాంబశివరావు, నగర పార్టీ కార్యవర్గ సభ్యులు ఎస్.పేరయ్య, దోనేపూడి సూరిబాబు, ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి లంక గోవిందరాజులు, సింగంశెట్టి మోహన్రావు, మహిళా సమాఖ్య నాయకులు శేషమ్మ, స్నేహలత, స్థానిక పార్టీ నాయకులు ఇటికాల శివ లక్ష్మణ, 18 వ డివిజన్ పార్టీ కార్యదర్శి అంబటిపూడి మోహన్ సాయి, కార్యదర్శి కురాకుల స్టాలిన్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు

# టీడీపీ కేంద్ర కార్యాలయనికి తరలివచ్చిన అర్జీదారులు

## –అర్జీలు స్వీకరించిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

**మంగళగిరి,మే 10 (వార్తాప్రభ) :** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అర్జీ దారులు తరలివచ్చారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ లు అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీనిచ్చారు. తమకు పిత్రార్జితంగా తాతల నుండి వచ్చిన ఆస్తిని గిరిజనుల పేరుతో ఆక్రమించుకోవాలని కొంత మంది చూస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం దొరమామిడి గ్రామానికి చెందిన యంట్రప్రగడ సత్యనారాయణ గ్రీవెన్స్ లో నేతలకు ఫిర్యాదు చేశాడు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188